ప్రజాశక్తి

శనివారం 3 డిసెంబర్ 2022 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

వరి దిగుబడి భారీగా తగ్గుదల

చేబ్రోలు మండలంలో పంట కోత ప్రయోగాలు

- అధిక వర్షాలతో రైతులకు కోలుకోని దెబ్బ
- కొన్ని గ్రామాల్లో 15 బస్తాలు కూడా రాని వైనం
- నష్టం వివరాల నమోదులో తిరకాసు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

జిల్లాలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. గత అక్టోబరులో అధిక వర్షాల వల్ల కొన్ని గ్రామాల్లో దిగుబడి గణనీయంగా తగ్గుతోంది. వ్యవసాయ, ప్రణాళిక, అర్థగణాంక శాఖాధికార్లు నిర్వహించిన పంట కోత ప్రయోగాల్లోనే ఈ విషయం వెల్లడైంది. సగటు దిగుబడి 25-30 బస్తాల (బస్తా : 75 కిలోలు) వరకు ఉంటుందని అంచనా కాగా కొన్నిచోట్ల 15 బస్తాలైనా రావడం లేదు. 30-40 గ్రామాల్లోనే ఎకరాకు గరిష్టంగా 35-40 బస్తాలు వచ్చే అవకాశం ఉంది. మిగతాచోట్ల ఈ ఏడాది వరి సాగు నష్టాలనే మిగుల్చుతోంది.

పంట కోత ప్రయోగాల ఆధారంగా ప్రజాశక్తి సేకరించిన సమాచారం ప్రకారం వివిధ గ్రామాల్లో సగటు దిగుబడి బాగా తగ్గుతోంది. చేబ్రోలు మండలం శలపాడు, నారాకోడూరు, కొల్లిపర మండలం తూములూరు, అన్నవరం, తెనాలి మండలం పినపాడు, దేవరపల్లి, పొన్నూరు మండలం ఆరేమండ, దొప్పలపూడి, కాకుమాను మండలం పాండ్రపాడు, వల్లూరు, మంగళగిరి మండలం రామచంద్రాపురం, నూతక్కి తదితర గ్రామాల్లో అత్యల్ప దిగుబడులు వస్తున్నాయి.

అక్టోబరులో కురిసిన అధిక వర్షం వల్ల జిల్లాలోని దాదాపు 15 మండలాల్లో వరికి అపార నష్టం వాటిల్లింది. అయితే అధికారులు ప్రభుత్వానికి సకాలంలో నివేదిక పంపకపోవడం వల్ల ఇప్పటి వరకు రైతులకు పరిహారమేమీ అందలేదు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా ద్వారా పరిహారం అందుతుందా? లేదా? అనేదీ సందిగ్ధంగా మారింది. వరికి గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుంటున్నారు. అయితే ఒకే గ్రామంలో కొన్ని భూముల్లో అత్యల్ప దిగుబడి వస్తుండగా కొన్ని భూముల్లో మాత్రం కొంత మెరుగైన దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు.

ముందస్తుగా సాగు చేసిన ▶ 2లో

సమావేశంలో మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

ధాన్యానికి రూ.వెయ్యి బోనస్ ఇవ్వాలి

- ఎఐకెఎస్ జాతీయ మహాసభను జయప్రదం చేయండి
- 6న నరసరావుపేటలో రైతు అమరుల జ్యోతి యాత్ర బహిరంగ సభ
- రైతు, కౌలురైతు సంఘాల రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, వై.రాధాకృష్ణ

ప్రజాశక్తి - నరసరావుపేట

కేరళ రాష్ట్రం త్రిశూర్‌లో ఈనెల 13-16 తేదీల్లో నిర్వహించే అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) జాతీయ మహాసభలు జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య పిలుపునిచ్చారు. రైతు అమరుల జ్యోతి' యాత్ర పేరుతో తెలంగాణ కడివెండి నుండి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య పేరుతో జాతా ఈనెల 6వ తేదీన దాచేపల్లి, పిడుగురాళ్ల, నరసరావుపేటలో యాత్ర ఉంటుందని తెలిపారు. యాత్ర సందర్భంగా పల్నాడు బస్టాండ్ కూడలిలో నిర్వహించే భారీ బహిరంగ సభలో అఖిల భారత కిసాన్ సభ జాతీయ నాయకులు పి.కృష్ణ ప్రసాద్ ప్రసంగిస్తారని, రైతులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. నరసరావుపేట పల్నాడు బస్టాండ్‌లో బహిరంగ సభ అనంతరం జాత వినుకొండ చేరుకుంటుందన్నారు. ఈ మేరకు రైతు, కౌలురైతు సంఘాల జిల్లా ▶ 2లో

స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, నగదును పరిశీలిస్తున్న ఎస్పీ తదితరులు

భారీ చోరీని చేధించిన పోలీసులు

ఇద్దరు అరెస్టు - 1167 గ్రాముల బంగారం, రూ.6.35 లక్షలు స్వాధీనం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు లక్ష్మీపురంలోని మహావీర్ జ్యూయలరీ షాపు తాళాలను గ్యాస్ కటర్‌తో కట్ చేసి నగదు, బంగారు ఆభరణాలు చోరీ చేసిన కేసులో ఇద్దర్ని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈ మేరకు వివరాలను జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ వెల్లడించారు. పాత గుంటూరుకు చెందిన షేక్ ఆలీ, తాడేపల్లి మండలం చిర్రావూరుకు చెందిన చిలకా రత్నరాజు కలసి గత నెల 20వ తేదీన ఈ నేరానికి పాల్పడ్డారు. వీరిని గుంటూరు రైల్వే స్టేషన్ వద్ద అరెస్టు చేశారు. ఇదే రీతిలో అక్టోబరు 24న చౌడవరం ఎటిఎం కేంద్రంలో కూడా గ్యాస్ కట్టర్‌తో కట్ చేసి చోరీకి విఫలయత్నం చేశారు. నిందితుల వద్ద నుండి 1167 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.6.35 లక్షలు, ద్విచక్ర వాహనం, చోరీకి ఉపయోగించిన గ్యాస్ సిలిండర్, వెల్డింగ్ గ్యాస్ ▶ 2లో

వాట్సప్ ద్వారా ప్రశ్నాపత్రాలు వద్దు

పాతపద్ధతిలోనే పంపిణీ చేయాలని గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారికి యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి - గుంటూరు

ముద్రించిన ప్రశ్నపత్రాల ద్వారానే పరీక్షలు నిర్వహించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష్య ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ కోరారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజకు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. ప్రభుత్వ షెడ్యూల్ ప్రకారం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఎఫ్‌ఎ-2 పరీక్షలు శుంక్రవారం నుండి ప్రారంభమయ్యాయని తెలిపారు. గత విధానాలకు భిన్నంగా పరీక్షకు ఒక గంట ముందు వాట్సప్ ద్వారా ప్రశ్న పత్రం పంపిణీ చేశారని, ఆ ప్రశ్నలను బోర్డు రాస్తే పిల్లలు వాటిని రాసుకుని జవాబులు రాయాలని ప్రభుత్వం తెలిపిందని వివరించారు. దీనివల్ల పిల్లలు పరీక్షలు సరిగా రాయలేకపోయారని అన్నారు. ప్రాథమిక పాఠశాలలో ఏకోపాధ్యాయ పాఠశాలలు ఎక్కువగా ఉన్నాయని, 5 తరగతుల ప్రశ్న పత్రాలు బోర్డు పై రాసి పరీక్షలు నిర్వహించటం వల్ల టీచర్లు, పిల్లలు ఇబ్బంది పడ్డారని వివరించారు. 1, 2 తరగతుల పిల్లలు ఈ పద్ధతిలో పరీక్షలు రాయలేకపోయారన్నారు. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకుని ప్రశ్నాపత్రాన్ని పాతపద్ధతిలోనే ముందుగా ఇవ్వాలని కోరారు. దీనితో పాటు పని సర్దుబాటును అదే మండలంలో లేదా పక్క మండలానికి పరిమితం చేయాలని కోరారు.

డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న ఆదిలక్ష్మి, కళాధర్

నిబంధనలన్నీ భ్రమరా

- వెంచర్ నిర్మాణం మొత్తం అవినీతి, అక్రమాలే
- విచారణ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండ భ్రమరా జిన్సిటీలో తవ్వే కొద్ది అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. కర్నూలు - గుంటూరు జాతీయ రహదారి మార్కాపురం రోడ్డులో ఉన్న శ్రీ భ్రమర జిన్సిటీ ప్రైవేట్ లిమిటెడ్ వెంచర్లో అన్ని అక్రమాలేనని తేలుతోంది. వినుకొండ మండలంలోని తిమ్మాయపాలెం రెవెన్యూ పరిధిలో సుమారు 100 ఎకరాల్లో నిర్మాణం చేపట్టిన భ్రమరా వెంచర్‌కు ల్యాండ్ కన్వర్షన్ అనుమతులు లేవు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు ప్రభుత్వ అనుమతులు పొందాల్సి ఉంది. ల్యాండ్ కన్వర్షన్‌కు చలానా చెల్లించి రెవెన్యూ అనుమతులు ▶ 2లో

మండలంలోని పాఠశాలల్లో 'విజిలెన్స్' తనిఖీలు

ప్రజాశక్తి -అమరావతి

మండల పరిధిలోని పలు పాఠశాలల్లో విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి యం.డియంను తనిఖీ చేశారు. దీనిలో భాగంగా విద్యార్ధులకు అందించే ఆహార పదార్థాలు,జగనన్న గోరుముద్ద మెనూ ప్రకారం వండి వడ్డిస్తున్నారా అని శ్రీ రామకష్ణా హిందూ హై స్కూల్ విద్యా ర్థులను అడిగి తెలుసుకున్నారు. బియ్యం,చిక్కీ,ఎగ్స్ స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. డైనింగ్ హాలు,పరిసర ప్రాంతాలు, ఆహారం తినే ప్లేట్ల పరిశుభ్రతను పరిశీలిం చారు. అనంతరం విజిలెన్స్ అధికార బృందం విద్యార్థులతో కలిసి ఆహార పదార్థాలను రుచి చూశారు.ఈ సందర్భంగా ధరణికోట (వెస్ట్) పాఠశాల, శ్రీ రామకష్ణ హిందూ హైస్కూల్లో నిర్వహించిన తనిఖీల్లో ఎలాంటి లోటుపాట్లు లేకపోవడం తో అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు.తనిఖీలో విజిలెన్స్ తహశీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు, సిఐ ఎన్.లక్ష్మారెడ్డి,ఎంజి ఎన్ ప్రసాద్, ఎపియం టి. శ్రీలక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు ఎం. విజయ తదితరులు పాల్గొన్నారు.

'జస్ట్ డయల్' లో 'తిరుమల' విద్యార్థులకు కొలువులు

ప్రజాశక్తి-నరసరావుపేట

మండలంలోని జొన్నలగడ్డ పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన వివిధ విభాగాలకు చెందిన 20 మంది విద్యార్థులు ప్రఖ్యాత జస్ట్ డయల్ కంపెనీలో కొలువులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవి నారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యార్థులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీ ప్రతినిధులు మధుకర్, సంపూర్ణ రావులు వివిధ విభాగాలలో నిర్వహించిన ఇంటర్వ్యూలలో మందికి పైగా విద్యార్థులు పాల్గొనగా 20 విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. ఉద్యోగుల సాధించిన విద్యార్థులకు రూ 2.70 లక్షల వార్షిక వేతనం పొందనున్నట్లు తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ బొల్లా బ్రహ్మనాయుడు, వైస్ చైర్మన్ బత్తిన నాగేశ్వరరావు, కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ, కోశాధికారి దండ బ్రహ్మానందం, ప్లేస్మెంట్ ఆఫీసర్ సాంబశివరావు కళాశాల అధ్యాపకులు అభినందించారు.

ఎపిఎన్జీవో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.ఐ రాజశేఖర్ కు సత్కారం

ప్రజాశక్తి-అమరావతి

ఆంధ్రప్రదేశ్ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన అమరావతి మండల ఇన్‌ఛార్జి ఆర్.ఐ సూరేపల్లి రాజశేఖర్‌ను శుక్రవారం ఘనంగా సత్కరించారు. మండల పరిధిలోని మల్లాది గ్రామానికి చెందిన క్రోసూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్, సీనియర్ నాయకులు వెంప. జ్వాల లక్ష్మీ నర సింహారావు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు రాజ శేఖర్ నుపూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జ్వాల లక్ష్మీ నర సింహారావు మాట్లా డుతూ పదవీ బాధ్యతలను సక్రమంగా నిర్వహించడంలో రాజశేఖర్ పాత్ర అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వి.నాగమణి వాసు, వైసిపి మండల నాయకులు బి. హనుమంతరావు, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

వరి దిగుబడి భారీగా తగ్గుదల

(మొదటి పేజీ తరువాయి)

వారికి ఎక్కువ నష్టం వాటిల్లగా ఆల స్యంగా సాగు చేసిన వారికి తక్కువ నష్టమని అధికారులు చెబుతున్నారు. దీంతో ఒకే గ్రామంలో దిగుబడుల హెచ్చుతగ్గుదల నమోదు వల్ల రైతులకు రావాల్సిన బీమా సదుపాయం ఎంత వరకు వస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది. కాకుమాను మండలం పాండ్రపాడులో వేర్వేరుగా నమోదైన పంట కోత ప్రయోగాల్లో ఒక భూమిలో సగటున 12 కిలోలు వస్తుండగా కొన్నిచోట్ల 20 కిలోల వరకు వస్తోంది. మొత్తం విస్తీర్ణంలో 50 శాతం పైన నష్టం ఉంటేనే బీమా పరిహారం వస్తుందని చెబుతున్నారు.

జిల్లాలో 1.55 లక్షల ఎకరాల్లో వరి సాగవగా 5.60 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. గత అక్టోబరులో అధిక వర్షాలు ముగిసిన తరువాత నష్టం వివరాలు నమోదులో అధికారులు తీవ్ర జాప్యం చేశారు. అధిక వర్షాల తరువాత దీపావళికి మళ్లీ తుపాను వస్తుందని సోషల్ మీడియాలో వచ్చిన కథనాలను పరిగణలోకి తీసుకుని మళ్లీ వర్షం వస్తే మరోసారి నష్టం వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందని, అందువల్ల మొత్తం ఒకేసారి నమోదు చేయవచ్చనే రీతిలో అధికారుల కొంత జాప్యం చేశారు. గత నెల 15న జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ లక్ష్మణరావుతో పాటు పలువురు సభ్యులు నష్టం వివరాలు అడగ్గా ఇంకా నివేదికలు పూర్తికాలేదని వ్యవసాయశాఖ అధికారులు సమాధానం ఇచ్చారు. తీరా ఇప్పుడు దిగుబడి తగ్గుదల చూసిన తర్వాత ఆయా గ్రామాల్లోని రైతులకు ఏ మేరకు పరిహారం అందుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది.

ధాన్యానికి రూ.వెయ్యి బోనస్ ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

కమిటీ సమావేశం స్థానిక కోటప్పకొండ రోడ్డులోని కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జి.బాలకృష్ణ అధ్యక్షత వహించగా కృష్ణయ్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈనాటికీ 65 నుండి 70 శాతం మంది ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. వ్యవసాయ రంగాన్ని కూడా కార్పొరేట్ల పరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలో భాగంగా తెచ్చిన మూడు చట్టాలను రైతాంగం ఏకతాటిపై పోరాడి తిప్పికొట్టిందని చెప్పారు. దేశ రక్షణ రంగాన్ని ప్రమాదంలోకి నెట్టే విధంగా అగ్నిపథ్ పథకాన్ని కేంద్ర తేగా ఈ విధానానికీ వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఎఐకెఎస్ కీలకపాత్ర పోషించిందని గుర్తు చేశారు. వ్యవసాయ సంక్షోభానికి పరిష్కారంగా స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని, విద్యుత్ సవరణ చట్టాన్ని నిలిపివేయాలనే డిమాండ్లతో మరో పోరాటానికి సమాయత్తమవుతున్నట్లు చెప్పారు. దేశంలో ఆహార సంక్షోభం నెలకొనక ముందే సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగాన్ని, రైతుల్ని ఆదుకోవాలని కోరారు. ఇందుకోసం కనీస మద్దతు ధరల చట్టం చేయాలన్నారు. కేరళ రాష్ట్రంలో వరి ధాన్యం క్వింటాళ్ రూ.3 వేలకు కొనుగోలు చేస్తుండగా ఆంధ్రప్రదేశ్‌లో రూ.2 వేలకు కూడా కొనడం లేదన్నారు. కేరళలో మాదిరి 25 రకాల ప్రధాన పంటలకు ప్రభుత్వం బాధ్యత తీసుకొని మద్దతు ధర కొనుగోలు చేయడం ద్వారా రైతులకు దన్నుగా నిలవాలన్నారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ పెరిగిన ఇన్‌పుట్ ధరలకు అనుగుణంగా పంట నష్టపరిహారాలు పెంచి చెల్లించాలని కోరారు. అన్ని పంటలకు బీమా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లాలో నీటి వసతి ఉన్నా పత్తి, మిర్చి పంటలకు బీమా లేకుండా చేయడం దుర్మార్గమన్నారు. నీటి వసతితో సంబంధం లేకుండా బీమాను అన్ని పొలాలకూ వర్తింపజేయాలని కోరారు. కౌలు రైతులకు ఈ-క్రాప్ నమోదు చేయాలని, ధాన్యానికి ప్రభుత్వం కొనుగోలు చేసిన ధరకు సంబంధం లేకుండా క్వింటాళ్‌కు రూ.వెయ్యి బోనస్ ఇవ్వాలని కోరారు. మిర్చిలో వస్తున్న తామర పురుగు నివారణకు, ఇతర తెగుళ్లకు శాస్త్రవేత్తలు ద్వారా ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తూ సలహాలు సూచనలు అందించాలని, అకాల వర్షాలకు నష్టపోయిన పత్తి రైతుకు ఎకరానికి రూ.25 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.రామారావు, నాయకులు నరసింహారావు, పిచ్చారావు, టి.హనుమంతరావు, పి.మహేష్, సురేష్ రాజా, వెంకటేశ్వర్లు, సుబ్బయ్య, బి.నాగేశ్వరరావు, ఆర్.వెంకటేశ్వర్లు, ఎస్.కోటిరెడ్డి, వై.సత్యనారాయణ, ఎం.పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలన్నీ 'భ్రమ'రా

(మొదటి పేజీ తరువాయి)

పొందాలి. ఈ నిబంధనలేమీ పాటించకుండా వెంచర్లో ప్లాట్లు వేసి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన సీనరైజ్ ఛార్జీలూ చెల్లించలేదు. ప్రభుత్వ ఆదాయాన్ని గండి కొడుతూ కోట్ల రూపాయలు అక్రమంగా పొందుతూ కొనుగోలుదారులను మోసం చేస్తున్నారని, వెంచర్లో కొంత స్థలం అనుమతి లేకుండా గ్రూప్ హౌస్‌లు కడుతున్నారని, వీటిపై వివరణాత్మక నివేదిక ఇవ్వాలని ఆర్‌టిఐ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు.

ప్రభుత్వం నుంచి పొందాల్సిన అనుమతులు లేకుండా భూమిని గజాల్లోకి మార్పుచేసి ఆకర్షణీయమైన బ్రోచర్లతో, ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్నారు. అన్ని అనుమతులూ ఉన్నాయంటూ, అన్ని సదుపాయాలు కల్పిస్తామని నమ్మిస్తూ కొనుగోలుదార్లను మోసం చేస్తున్నారు. తాజాగా ఆర్‌టిఐ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఫిర్యాదుతో భూమిని సర్వే చేస్తున్నట్లు తహశీల్దార్ కిరణ్ కుమార్ తెలిపారు. అంతేకాకుండా చీకటిగలపాలెం మేజర్ కాల్వ వద్ద మైనర్ కాల్వను పూడ్చివేసి అక్రమ నిర్మాణాలు చేశారని ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇదిలా ఉండగా భ్రమరా వెంచర్ చుట్టూ అధికంగా ప్రభుత్వ భూములున్నాయని, వెంచర్లో కూడా కొంత భూమి ఆక్రమణకు గురైందని అధికారులకు సమాచారం వచ్చిందని, దీనిపైనా విచారణ చేస్తున్నారని తెలిసింది.

ఇదిలా ఉండగా వ్యవసాయ అవసరాలకు 9 గంటలపాటు ఉచితంగా సరఫరా విద్యుత్‌ను భ్రమర వెంచర్స్ నిర్వాహకులు అక్రమంగా వినియోగిస్తుండగా అధికారులు గుర్తించి రూ.10 లక్షల జరిమానా విధించారు. ఇందుకు సహకరించిన విద్యుత్ శాఖ వినుకొండ రూరల్ ఎఇ సైతం సస్పెండ్ అయ్యాడు. గుండ్లకమ్మ నది నుండి అనుమతులు లేకుండా నీటినీ తరలిస్తుండగా గత నెల 15వ తేదీ మైనర్ ఇరిగేషన్ అధికారులు గుర్తించి తహశీల్దార్‌కు నివేదించగా చర్యల కోసం జిల్లా కలెక్టర్‌కు సిఫార్సు చేశారు.

ల్యాండ్ కన్వర్షన్ లేదు

శేషిరెడ్డి, ఆర్‌డిఒ, నరసరావుపేట

భ్రమర జిన్సిటి వెంచర్‌కు ల్యాండ్ కన్వర్షన్ అనుమతులు లేవు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చాలని భ్రమరా జిన్సిటీ వారు చలానా చెల్లించారేగాని అనుమతులు లభించలేదు. ల్యాండ్ కన్వర్షన్ చలానా ఆధారంగా డిటిసిపి అనుమతులు పొందినట్లు తెలిసింది. కానీ ల్యాండ్ కన్వర్షన్ కావాలంటే భూమి సర్వే చేసి, ఆ భూమికి సబ్ డివిజన్లు ప్రకటించి అభ్యంతరాలేమీ లేకుంటే ఆర్డీవో కార్యాలయం నుండి ల్యాండ్ కన్వర్షన్ అనుమతి లభిస్తుంది.

భారీ చోరీని ఛేధించిన పోలీసులు

(మొదటి పేజీ తరువాయి)

కట్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల అరెస్టు కోసం అదనపు ఎస్‌పి శ్రీనివాసరావు పర్యవేక్షణలో మొత్తం 25 మంది బృందంగా గాలించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి సుప్రజ, క్రైం అదనపు ఎస్‌పి శ్రీనివాసరావు, డిఎస్‌పి శ్రీనివాసరావు, సిఐ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

ఒ.యస్.నెం.599/2022

బిట్వీన్:

ఆలపాటి రాజ్యలక్ష్మి ....వాది

ఎదిరి

మిన్నకంటి శ్రీనివాసరావు ...ప్రతివాది

ప్రతివాది: మిన్నకంటి శ్రీనివాసరావు తండ్రి: శేషయ్య, రెసిడెంట్ డోర్ నెం.17-1-26, వహాబ్ రోడ్డు, తెనాలి, గుంటూరు జిల్లా.

పై నెంబరు దావాలో మీకు శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను మీరు సదరు నోటీసులను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీయుత కోర్టువారు ఉత్తర్వుల ప్రకారము ఈ పత్రికా ప్రకటన ద్వారా మీకు ఈ నోటీసును ఇవ్వడమైనది. సదరు నోటీసు ప్రకారము ది.12-12-2022 ఉదయం 10-30 గంటలకు శ్రీయుత కోర్టువారి ఎదుట మీరు స్వయముగా గాని మీ తరుపు న్యాయవాది ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల సదరు దావాను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీయుత కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము)

వాయిదా:12-12-2022

తెనాలి,

తేది:01-12-2022

ఇట్లు

మందలపు వేణుగోపాలరావు,

వాది తరపు అడ్వకేట్, తెనాలి,

సెల్:9848251024

NOTICE

IN THE COURT OF THE HON'BLE PRL.DIST.JUDGE::GUNTUR

I.A.No: 597/2019 in I.A.No:82/2015 in A.S.No: /2015

Between:

Shaik Abdul Kareem(Died) & Others ...Petitioners

And

Pamulapati Sivannarayana &Others ...Respondents

To,

R-2: Pamulapati Ankamma Rao, S/o.Late Sambaiah,

R-4: Pamulapati Venkateswara Rao, S/o. Late Rama Rao,

R-6: Modalla Khadar Vali, S/o.Hussain Bi

All are R/o.Perecherla Village, Medikonduru Mandal, Guntur Dist.

పై నెంబరు పిటీషను I.A.No:82/2015 ను Restore చేయమని దాఖలు చేసిన పిటీషనులో జరిగిన 1రోజు ఆలస్యమును క్షమించమని సదరు పిటీషనులో R-2, R-4, R-6 రెస్పాండెంట్లు అయిన మీరు కోర్టు నోటీసులు తీసుకోనక కాలయాపన చేయుచున్నందున ఈ వార్త పత్రిక ద్వారా మీకు తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది:15-12-2022 కి వాయిదా వేసినారు. కావున ఆ రోజున ఉ.గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోనవలెను. లేనిచో శ్రీ కోర్టు వారిచే మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది:15-12-2022

జి.సీతారామి రెడ్డి ,

పిటీషనర్లు తరపు అడ్వకేట్,

గుంటూరు.

IN THE COURT OF PRINCIPAL JUNIOR CIVIL JUDGE:TENALI

O.S.No: 839/2022

Between:-

Gadiko Suseela ....Plaintiff

V/S

Vanga Sambrajyam and 14 others ...Defendants

To

4th Defendant:

Nallamanikarla Padma Priya, W/o N.Bhaskara Reddy, R/o Falt No. 208. Venkata Padmavathi Enclave, Near Mango Market Yard, Thiruchanuur Road, Tirupati-517501, Chittor District.(A.P)

5th Defendant:

Thippareddy Harshavardhan Reddy, S/o Late Bipireddy, C/o N.Padma Priya, R/o Falt No. 208. Venkata Padmavathi Enclave, Near Mango Market Yard, Thiruchanuur Road, Tirupati-517501, Chittor District.(A.P)

9th Defendant:

Vintha Sreenivasa Reddy, S/o Late Sambi Reddy, Business, R/o Door No:6-12-13, Jairam Street, Tailorpet, Vijayawada-520001.

10th Defendant:

Gudibandi Sivarama Krishna Reddy, S/o Late Vema Reddy, R/o Door No.64/5/3, Patamalanka, Near Z.P.H.S.Girls High School, Vijayawada-520010.

11th Defendant: Gade Koti Reddy, S/o Venkateswara Reddy, R/o Door No:7-8, Near Bose Bomma Centre, Venigandla Village-522509, Pedakakani Mandal, Guntur Dist.

12th Defendant: Gade Naga Durga, W/o Late G.Ravindra Reddy, R/o Door No:7-8, Near Bose Bomma Centre, Venigandla Village-522509, Pedakakani Mandal, Guntur Dist.

13th Defendant: Kota Madhavi, W/o Venkata Reddy, R/o House No.2-73, Siva Reddy Palem, Guntur Rural, Guntur Dist.

11th Defendant:

Munnangi Seetha Mahalakshmi, W/o Late M.Siva Reddy, R/o Venigandla Village, Pedakakani Mandal, Guntur Dist.

పై నెంబరు దావాలో 4,5,9,10,11,12,13,15 ప్రతివాదులయిన మీకు శ్రీ కోర్టు ద్వారాను మరియు రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు ఈ పేపరు ప్రకటన దావా సమన్లు పంపవలసిందిగా పై కోర్టువారు ఆర్డరు వేస్తూ ది.8-12-2022వ తేదికి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా రోజు ఉదయం 10-30గంటలకు మీరు స్వయంగా గాని, మీ తరుపు న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టువారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల సదరు దావాను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)

వాయిదా:8-12-2022

తాడిబోయిన శ్రీనివాసరావు,

వాది తరుపు న్యాయవాది,

తెనాలి.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - గుంటూరు లీగల్ : రాజ్యాంగ దినోత్సవ వారోత్సవాల సందర్భంగా గుంటూరు నగరంలోని 7 ప్రభుత్వ పాఠశాలలను గుర్తించి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, స్లోగన్ రైటింగ్, చిత్రలేఖన, క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీలను విద్యాశాఖ సహకారంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ నిర్వహించగా విజేతలకు బహుమతులను శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవిఎస్‌బిజి పార్థసారధి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, గుంటూరు కార్యదర్శి, సీనియర్ సివిజ్ జడ్జి కె.రత్నకుమార్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్యానెల్ అడ్వకేట్ కె.కాళిదాసు, పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

17న జాతీయ పెన్షనర్స్ దినోత్సవం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఈనెల 17న జాతీయ పెన్షనర్స్ దినోత్సవాన్ని మధ్యాహ్నం 2 గంటలకు పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహిస్తామని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొమ్మదేవర వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. తొలుత అధ్యక్షులు మాచిరాజు రామకృష్ణమూర్తి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ఉంటుందని, అనంతరం 75 ఏళ్లు నిండిన అసోసియేషన్ సభ్యులు 193 మందికి ఆత్మీయ సత్కారం చేస్తామని తెలిపారు.

హనుమాన్‌పాలెంలో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - కొల్లిపర

మండలంలోని హనుమాన్‌పాలెంలో టిడిపి ఆధ్వర్యంలో శుక్రవారం 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహించారు. హాజరైన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ స్థానికులతో మాట్లాడి కరపత్రాలు అందించారు. టిడిపి మండల అధ్యక్షులు బి. చిన్న కోటిరెడ్డి వంగాసామిరెడ్డి, సర్పంచ్ జోగేంద్ర, కె.శివరామిరెడ్డి పాల్గొన్నారు.

మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 20,444
మిర్చి ఎగుమతి	: 20,160
మిర్చి నిల్వ	: 10,522

మిర్చి ధరలు

	రూపాయలలో
334	10,000 - 25,000
నంబర్ 5	14,000- 18,000
273	14,000 - 20,000
341	13,500 - 23,500
4884	14,000 - 25,000
నాన్ ఎసి	
తేజ	10,000 - 23,500
బడిగి	9,200 - 25,000
దేవనూరు డీలక్స్	12,800 - 24,800
తాలుకాయలు	6,000 - 14,000
ఎసి	
334	10,000 - 25,000
నెం.5	10,000 - 16,000
341	18,000 - 23,500
తేజ	10,000 - 23,000
బడిగి	19,000 - 25,000
తాలుకాయలు	6,200 - 12,000

ఇళ్ల నిర్మాణం అడ్డుకుంటున్నారని ధర్నా

ప్రజాశక్తి - తాడికొండ

సొంత ఇంటి కల నేరవేర్చుకోటానికి స్థలం కొనుగోలు కోసం పైసా పైసా కూడబెట్టి పొలాన్ని కొనుగోలు చేస్తే రెవెన్యూ అధికారుల తప్పుడు ధ్రువీకరణ పత్రాల వల్ల 25 దళిత కుటుంబాలు రోడ్డున పడ్డాయని గరికపాడుకు చెందిన పలువురు తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. వారి వివరాల ప్రకారం.. గరికపాడులో 1.45 ఎకరాలను 25 మంది దళితులం రూ.1.5 కోట్లకు సుదామయి అనే మహిళ వద్ద కొనుగోలు చేశారు. అక్కడ ఇల్లు నిర్మించుకుందామనుకునే సయమంలో రెవెన్యూ అధికారులు అడ్డుపడ్డారు. వారు కొనుగోలు చేసిన భూమి మరో సర్వే నంబరులో ఉందంటూ పనులను అడ్డుకున్నారు. దీనిపై బాధితులు రాష్ట్ర ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించగా గ్రామాన్ని చైర్మన్ సందర్శించారు. ఖాళీగా ఉన్న భూమిలోకి దళితులను వెళ్లనీయాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించగా ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు ఆర్‌డిఓ లేఖ రాశారు. దీంతో ఎస్సీలు తమ స్థలంలో తాత్కాలిక నిర్మాణాలు చేపట్టగా వాటినీ రెవెన్యూ అధికారులు నాలుగు రోజుల క్రితం అడ్డుకున్నారు. దీంతో ఎస్సీలు ఆందోళనకు దిగారు. దీనిపై డిప్యూటీ తహశీల్దార్ కె.ప్రసాద్ మాట్లాడుతూ మీరు కొనుగోలు చేసిన స్థలం సర్వే నంబరు వేరు.. మీరు తాత్కాలికంగా నిర్మాణాలు చేస్తున్న స్థలం వేరు.. అని చెప్పారు. ఆ స్థలాన్ని విక్రయించిన వ్యక్తిని నిలదీయాలని సూచించారు. అయితే తాము నిర్మాణాలు చేపట్టిన స్థలంలోనే మరొకరు ఏడాదిగా నిర్మాణాలు చేస్తున్నా ఎందుకు నిలిపేయలేదని బాధితులు ప్రశ్నించారు. ఈలోగా సిఐ శ్రీనివాసరావు అక్కడకు చేరుకుని బాధితులకు నచ్చజెప్పి పంపించారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న బాధితులు

ఎబిఎం ఆస్తులకు కలెక్టర్ పరిశీలన

క్రయవిక్రయాలు నేరమని బోర్డుల ఏర్పాటుకు ఆదేశం

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని ఎబిఎం ఆస్తులను పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ శుక్రవారం పరిశీలించారు. ఆర్ అండ్ బి బంగ్లా ఎదురుగా ఉన్న అమెరికన్ బాప్టిస్ట్ ఫారిన్ మిషన్ సొసైటీకి చెందిన ఆస్తులను కొందరు అమ్ముకుంటున్నారని ఇమ్మానియేల్ తెలుగు వినుకొండ బాప్టిస్ట్ చర్చి అభివృద్ధి సంఘం సభ్యులు కలెక్టర్‌కు చెప్పారు. దీంతో ఆయన ఎంబిఎం క్యాంప్ స్కూల్ కాంపౌండ్, ఉమెన్స్ బంగ్లా ఆస్తులను పరిశీలించారు. సర్వే నంబరు 394/1/4,395,396 లోని 14.74 సెంట్ల స్థలాన్ని పరిశీలించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో అప్పటి రెవెన్యూ సిబ్బందిగా పని చేసి రిటైర్ అయిన వారితో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దీనిపై పూర్తిస్థాయి విచారణ చేయించి నివేదిక వచ్చాక న్యాయం చేస్తామన్నారు. ఎబిఎం ఆస్తులు కొనుగోలు, అమ్మకాలు నేరమని తెలిపేలా ఆయా ఆస్తుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుకు తహశీల్దార్‌ను ఆదేశించామన్నారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఒ శేషిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, తహశీల్దార్ కిరణ్, మున్సిపల్ వైస్ చైర్మన్ గాబ్రియేల్, జిల్లా పరిషత్తు కో-ఆప్షన్ సభ్యులు స్పేనోమ్, చర్చి అభివృద్ధి సంఘం అధ్యక్షులు శ్యామ్ ప్రసాద్, కార్యదర్శి ఫిలిప్ ఉన్నారు.

పెరుమాళ్లపల్లి మేజర్ కాల్వపై బ్రిడ్జీ కోసం వినతి

ఎన్‌ఎస్‌పి కాల్వపై బ్రిడ్జి, రహదారి లేకపోవడంతో రైల్వే స్టేషన్‌కు వెళ్లడానికి నానా అవస్థ పడుతున్నామని పట్టణంలోని శ్రీనివాసనగర్, ఇందిరనగర్, రాజీవ్ కాలనీ, డ్రైవర్స్ కాలనీ, నాగిరెడ్డిపల్లె ప్రజలు కలెక్టర్ ఎదుట వాపోతున్నారు. 30 ఏళ్లుగా వున్న సైఫాన్‌ను ఐతం కొన్నేళ్ల కిందట తొలగించడంతో ఈ సమస్య మొదలైందని, సైఫాన్ లేకపోవడంతో సుమారు 2 కిలోమీటర్లు నడవాల్సి వస్తోందని అన్నారు. గుంటూరు, విజయవాడ, మార్కాపురం, గిద్దలూరు, ప్రాంతాలకు తాము తరచూ ప్రయాణిస్తుంటామని, కాల్వపై బ్రిడ్జి ఏర్పాటు చేస్తే అరకిలో మీటరు దూరంలోనే రైల్వేస్టేషన్‌కు వెళ్లే వీలుంటుందని తెలిపారు. సమస్య పరిష్కారానికి అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఆస్తులను పరిశీలిస్తున్న పల్నాడు కల్టెర్ శివశంకర్

రేపు ఘంటసాల, ఎస్పీ బాలు విగ్రహాల ఆవిష్కరణ

నరసరావుపేట కళావేదిక ఆధ్వర్యంలో సంగీత విభావరి

ప్రజాశక్తి - నరసరావుపేట

నరసరావుపేట కళావేదిక ఆధ్వర్యంలో ఘంటసాల శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం ఘంటసాల వెంకటేశ్వరరావు, ఎస్పీ బాలసుబ్రమణ్యం విగ్రహాల ఆవిష్కరణ, శక పురుషులైన సాలూరి రాజేశ్వరరావు, ఎన్టీఆర్, సూపర్ స్టార్ కృష్ణ, సినీ రచయిత అనిశెట్టి సుబ్బారావుకు నివాళి కార్యక్రమం ఉంటుందని నరసరావుపేట కళావేదిక కార్యనిర్వాహకులు పొన్నపాటి ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు వివరాలను శుక్రవారం స్థానిక టౌన్‌హాలులో వెల్లడించారు. కార్యక్రమాలు ప్రకాష్ నగర్‌లోని భువనచంద్ర టౌన్‌హాలులో ఘట్టమనేని కృష్ణ కళావేదికపై నిర్వహిస్తామన్నారు. ఘంటసాల, బాలసుబ్రహ్మణ్యం విగ్రహాల ఆవిష్కరణకు వారి కుటుంబాలను ఆహ్వానించినా అనివార్య కారణాల వల్ల వారు రాలేకపోతున్నట్లు చెప్పారని తెలిపారు. విగ్రహావిష్కరణకు అతిథులుగా తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవి సుబ్బారెడ్డి, సినీ సంగీత దర్శకులు సాలూరి కోటేశ్వరరావు (కోటి), ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎస్పీ రవిశంకర్ రెడ్డి, ఆర్డీవో, టౌన్ హాల్ కమిటీ చైర్మన్ ఎం.శేషిరెడ్డి హాజరవుతారని వివరించారు. సభానంతరం సాయంత్రం 6 గంటలకు సంగీత దర్శకులు గాయకులు మధు, బాలసుబ్రమణ్యం, బాపు , ఈటీవీ పాడుతా తీయగా విజేత రసూల్, ప్రముఖ గాయకులు శైలజ, మైథిలి, లాలిత్య ఆధ్వర్యంలో సంగీత విభావరి ఉంటుందన్నారు. ఘంటసాల విగ్రహానికి రూ.1.50 లక్షలను డాక్టర్ కట్టా చారులత అందజేశారని, కార్యక్రమం నిర్వహణకు పలువురు విరాళాలిచ్చారని చెప్పారు. కార్యక్రమంలో కళా వేదిక కమిటీ అధ్యక్షులు శ్రీగిరిరాజు అయ్యప్పరాజు, సభ్యులు భాగవతుల లక్ష్మీనారాయణ (దుర్గా స్టూడియో బాబు), స్వర్ణ చినరామిరెడ్డి, గోపాల్‌బాబు, అమరేంద్ర, సుశీల్ కుమార్ పాల్గొన్నారు.

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

రైలు కింద పడి ఒకరు మృతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని గుడిపూడి- పెదకూరపాడు సెక్షన్ల మధ్య శుక్రవారం చోటుచేసుకుంది. మృతునికి 35 ఏళ్ల వరకు ఉంటాయని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. గ్యాంగ్‌మెన్ సమాచారం మేరకు ఘటనా స్థలిని రైల్వే పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రైల్వే ఎస్‌ఐ సుబ్బారావు కేసు నమోదు చేశారు. వివరాలు తెలిసిన వారు ఎఎస్‌ఐ వెంకట్రావు ఫోన్ నంబర్ 7780171069కు సంప్రదించాలని సూచించారు.

వరి పైరుపై గడ్డి మందు పిచికారి

ప్రజాశక్తి - ఈపూరు

భూవివాదాల నేపథ్యంలో వరి పంటపై గడ్డి మందు పిచికారి చేసిన సంఘటన మండలంలోని కొండ్రముట్లలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముత్యాల వరలక్ష్మి వారి సమీప బంధువులకు కొంతకాలంగా భూమి వివాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో పంటను నాశనం చేయాలనే ఉద్దేశంతో వరి పైరుపై గడ్డి మందును పిచికారి చేయడంతో మందు ప్రభావంతో 50 సెంట్లు వరి పంట దెబ్బతిన్నది. బాధితురాలు వరలక్ష్మి ఫిర్యాదు మేరకు బావ ముత్యాల వెంకట స్వామి, పూర్ణయ్య, సీతయ్య మీద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వి.వెంకట్రావు తెలిపారు.

క్షతగాత్రునికి ఎమ్మెల్యే వైద్యం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు -విజయవాడ జాతీయ రహదారిపై లారీ బైక్ ఢీ కొన్న సంఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. ద్విచక్ర వాహనం నడుపుతున్న యువకుడు తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి వెళ్లాడు. అయినా ఎవ్వరూ పట్టించుకోలేదు. అదే సమయంలో ఆ మార్గంలో వెళ్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి కారు దిగి యువకుడిని పరిశీలించారు. ప్రథమ చికిత్స చేసి 108ను పిలిపించి ఆస్పత్రికి పంపించారు. అప్పటి వరకూ క్షతగాత్రుణ్ణి చూస్తున్నా పట్టించుకోని వారిని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తిని ఆస్పత్రికి పంపించేందుకు సాయం చేయకపోవడం సరికాదన్నారు.

పదో తరగతి విద్యార్థి అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి- మేడికొండూరు

మండలంలోని పేరేచర్ల ఇంటెల్ హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి అదృశ్యంపై మేడికొండూరు పోలీస్‌స్టేషన్‌లో గురువారం రాత్రి కేసు నమోదైంది. ఫిరంగిపురం మండలం వేములూరుపాడుకు చెందిన సుంకర మనోజ్‌కుమార్ పేరేచర్ల ఇంటెల్ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్నాడు. రోజు మాదిరిగానే గత నెల 30వ తేదీన ఉదయం పాఠశాలకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు బంధువుల వద్ద విచారించారు. అయినా ఫలితం లేకపోవడంతో విద్యార్థి తండ్రి సుంకర వెంకటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసినవారు ఎస్‌ఐ ఎం.కోటేశ్వరరావు 8688831380కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

మత్తుపదార్థాలతో ప్రమాదాలు

ప్రజాశక్తి- నాదెండ్ల

మత్తుపదార్థాలు సేవించడం వల్ల జరిగే నష్టంపై గణపవరం ఐసిఎం స్పిన్నింగ్ మిల్లులో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో చిలకలూరిపేట రూరల్ సిఐ అచ్చయ్య, నాదెండ్ల ఎస్ఐ ఆవుల భాస్కరరావులు తమ సిబ్బందితో పాల్గొన్నారు. మత్తు పదార్థాలు గంజాయి, గుట్కా సేవించి రోడ్లు దాటడం వల్ల ఎటువంటి ప్రమాదాలు జరుగుతాయి దానిపై పూర్తి అవగాహన కల్పించారు. ఈ స్పిన్నింగ్ మిల్లులో పనిచేస్తున్న ఛత్తీస్‌గఢ్, ఒడిశాలకు చెందిన కార్మికులు మత్తు పదార్థాలు తీసుకుని రోడ్లు దాటడం వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా కార్మికులు నివాస ప్రాంతాలను పోలీసులు సందర్శించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

200 మందికి పైగా వైద్య సేవలు

ప్రజాశక్తి- నరసరావుపేట

ఉచిత వైద్య శిబిరాలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాక్స్ కేర్ సాయి తిరుమల హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ యనమదల వెంకట రామయ్య కోరారు. మండలంలోని పమిడిపాడులో శుక్రవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రముఖ ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ వై.శ్రీహర్ష, గ్యాస్ట్రోఎంటరాలజీ డాక్టర్ మన్నే గౌతమ్, జనరల్ వైద్యనిపుణులు శంకర్‌లు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వ హించి మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో 200 మందికి పైగా గ్రామస్తులకు ఉచితంగా బిపి, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ వై. వెంకటరామయ్య మాట్లాడుతూ రానున్న రోజులలో తమ హాస్పిటల్ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వై.శివ ప్రదీప్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాం తాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. రోగ నిర్ధారణ పరీక్షలలో ఆపరేషన్లు అవసరమైన వారికి ఆరోగ్య శ్రీ ద్వారా వైద్య సేవలు అందిస్తామని ,ఆరోగ్యశ్రీ లేని పేద ప్రజలకు అతి తక్కువ ధరలకు వైద్య సేవలు అందించనున్నట్లు చెప్పారు.మాక్స్ కేర్ సాయి తిరుమల హాస్పిటల్ లో అన్ని విభాగాలలో వైద్య సేవలు అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరలలో అందించనున్నట్లు పేర్కొన్నారు. తమ హాస్పిటల్ లో ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీలు, సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

నేషనల్ సైన్స్ ఒలింపియాడ్ టెస్ట్

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక గీతమ్స్ గ్లోబల్ మైండ్స్ స్కూల్‌లో సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ (ఎస్ఓ ఎఫ్) ఆధ్వర్యంలో 2022- 23 విద్యాసంవత్సరానికి గాను నేషనల్ సైన్స్ ఒలింపియాడ్ టెస్ట్(ఎన్ఎస్ఓ) నిర్వహించారు. ఈ టెస్ట్‌కు 5 నుండి 8వ తర గతి వరకు విద్యార్థులు హాజరైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎన్. సూర్య నారాయణ తెలిపారు. సైన్స్ ఒలింపియాడ్‌ల వలన విద్యార్థులలో సైన్స్‌పై ఆసక్తి ఏర్పడుతుందన్నారు.

బతుకు భారం..అందని పరిహారం!

ప్రజాశక్తి-చిలకలూరిపేట

కార్మికులు పనులకు వెళ్లేటప్పుడో, తిరిగి ఇళ్లకు చేరేసమయంలోనో రోడ్డు ప్రమాదాలకు గురైన వారి కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రమాద సంఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన కార్మికులు కొం దరైతే, అంగ వైకల్యంతో ఇంటికే పరిమితమైన వారు మరికొందరు.నియోజకవర్గంలో కార్మికులు రోడ్డు ప్రమాదాలకు గురైన సంఘటనల్లో ఆయా కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోవడంతో రోడ్డున పడుతున్న కుటుంబాలు వందల సంఖ్యలోనే ఉం టుంది. ఆర్థికంగా అంతంతమాత్రంగా ఉండే కార్మికుల కుటుంబాల్లో సంపా దించే వారిని పోగొట్టు కోవడంతో రోజులు గడవడం ఆయా కుటుంబాలకు కష్ట తరంగా మారుతోంది. చిన్నపాటి సంపాదనతో రోజులు నెట్టుకొస్తున్న వారి కుటుంబాల్లో పిల్లల చదువులు అర్థాంతరంగా ఆగిపోతున్నాయి. బతుకుదెరువు కోసం ఆయా కార్మిక కుటుంబాల లోని మహిళలు కూలీ పనులకు వెళుతున్నారు. రోడ్డు ప్రమాదాల బారినపడ్డ కార్మికుల కుటుం బాలకు ప్రభుత్వం అందజేసే నష్ట పరిహారం కూడా వారికి అందడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నడూ బజారుకు రాని మహిళలు సైతం కుటుంబ పోషణకు కూలీ పనులకు వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు.

ఇంతవరకూ పరిహారం అందలేదు..

చిలకలూరిపేటలోని ఎన్టీఆర్ సెంటర్‌లో ఓ చిన్న హోటల్ నిర్వహిస్తున్న దంపతులు బత్తిన సాంబశివరావు, సునీత. వారికి ఇద్దరు సంతానం బత్తిన కుమారస్వామి, మౌనిక. గత ఏడాది సెప్టెంబర్ 17న ఎఎంజి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమారస్వామి (19) మృతి చెందాడు. తన చెల్లెలు మౌనికను ఇంటర్ పరీక్షలు నిమిత్తం ద్విచక్ర వాహనంపై తీసుకువెళ్తుండగా లారీ ఢీ కొట్టడంతో అతను చనిపోయాడు. కుమారుడు మృతి చెందడంతో అతని తల్లి దండ్రులు పరిస్థితి వర్ణనాతీతం. పల్లె నుంచి పొట్ట చేత పట్టుకొని పట్నం వచ్చామని, కుమారుడు చిన్నతనంలోనే బాధ్యతలు తీసుకుని కుటుంబాన్ని పోషించేవాడని అన్నారు. ఈ ప్రమాద ఘటనకు సంబంధించిన పరిహారం ఇంత వరకూ తమకు అందలేదని చెప్పారు.

బిడ్డలను చదివించుకోవాలనుకుంటే...

భవన నిర్మాణ కార్మికురాలు బండారు కృష్ణవేణి. కావూరులోని వడ్డెర కాలనీలో చిన్న రేకుల షెడ్‌లో తన తండ్రి దగ్గర ఉంటోంది. మద్యానికి బానిసైన తన భర్త చిన్నాను వదిలి, తన ఇద్దరు పిల్లలతో నివసిస్తోంది. కుమారుడు వెంకట్ డిగ్రీ, కుమార్తె అనూషా 9వ తరగతి చదువుతున్నారు. కృష్ణవేణి కూలి పనికి వెళితేనే కుటుంబం గడిచే పరిస్థితి.ప్రతిరోజూ మాదిరిగానే 23.02.2020న పనులకు వెళ్లిన ఆమె, ముగించుకుని వస్తోంది. అదే గ్రామానికి చెందిన తాపీ మేస్త్రి మోటారు సైకిల్‌పై చిలకలూరిపేట-నరసరావుపేట మార్గంలో లింగంగుంట్ల సమీపంలో కుప్పగంజి వాగు వంతెన పైకి ఆ వాహనం వెళుతుండగా చిలకలూరిపేట వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు, ఆ మోటార్ సైకిల్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె రెండు కాళ్లకూ తీవ్ర గాయాలయ్యాయి. ఆమెకు తన వాటాగా వచ్చినా పొలాన్ని మూడు రూపాయల వడ్డీకి తాకట్టు పెట్టి వైద్యం నిమిత్తం ఎనిమిది లక్షలు ఖర్చు చేయాల్సి వచ్చింది. శస్త్ర చికిత్స చేసి ఆమె కుడి కాలును తీసివేశారు. అప్పటి నుంచి కుటుంబం మరింత ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. కుటుంబ పోషణ నిమిత్తం కుమారుడు రోజూ భవన నిర్మాణ పనులకు, కూలీ పనులకు వెళ్తున్నాడు. కష్టపడి సంపాదించిన డబ్బుతో కన్న బిడల్దను చదివించుకోవాలనుకుంటే విధి చిన్న చూసిం దని కృష్ణవేణి వాపోతున్నారు. తీసుకున్న డబ్బులకు వడ్డీ ఎలా కట్టాలో, అసలు ఎలా తీర్చాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద బీమా డబ్బులొస్తే బాకీ తీర్చాలని ఎదురు చూస్తు న్నానని, ఇంత వరకు ఈ కేసు ఓ కొలిక్కి రాలేదని చెప్పారు.

జీతమే ఆధారం..

మండల పరిధిలోని కావూరుకు చెందిన తాపీ మేస్త్రి పారెళ్ల సుబ్బారావు ద్విచక్ర వాహనంపై వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తన భర్త ప్రమాదంలో చనిపోవడంతో కుటుంబం దిక్కు లేని పరిస్థితిలోకి వచ్చిందని భార్య అంజలి కన్నీటి పర్యంతమయ్యారు. తమకు ముగ్గురు సంతానం పిల్లలు అభిషేక్, గాయత్రి, లక్ష్మి ఉన్నారని చెప్పారు. కుటుంబపోషణ కోసం ఓ ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్నానని, ఆ జీతమే తమకు ఆధారమని తెలిపారు. బంధువులు ఎవరు తమకు ఎలాంటి సాయం అందిం చడం లేదని అన్నారు. కుమారుడు డిగ్రీ, కుమార్తె ఇంటర్ చదువుతున్నా రని, వారిని ఉన్నత చదువులు చదివించాలన్నది లక్ష్యంతో కష్టపడక తప్పడం లేదన్నారు.

నిబంధనలు అమలు కావట్లేదు

కార్మికుల సంక్షేమ బోర్డు నుంచి రూ.9 వందల కోట్లను ప్రభుత్వం తీసుకోవడం వల్ల రోడ్డు ప్రమాదాలకు గురైన బాధితులు, వారి కుటుంబాలు వేల సంఖ్యలో ఉన్నాయని, వారికి చెల్లించాల్సిన పరిహారం అందడం లేదని, ఇతర క్లెయిమ్స్ కూడా పెండింగ్‌లో ఉన్నాయని సిఐటియు మండల కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు అన్నారు. ప్రమాదాల బారినపడ్డ వారి కుటుంబాలకు నాలుగు సెంట్ల స్థలం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా వెంటనే స్పందించి సవరించిన చట్టాలను వెనక్కి తీసుకోవాలని, ఇలాంటి వారిని వెంటనే ఆదుకోవాలని కోరారు. ముఖ్యంగా కార్మికులకు నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదని, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల చెందిన వారు పెళ్లిళ్లు చేసుకుంటే రూ.20 నుంచి రూ.50 వేల వరకు ఇస్తామన్నా ప్రభుత్వం ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. ప్రమా దాలకు గురైన కార్మికులకు ఆసుపత్రి బిల్లులు, చనిపోతే ఇవ్వాల్సిన రూ.5 లక్షల పరిహారం కూడా ఎక్కడా అమలు కాలేదన్నారు.

7,8 తేదీలతో ఒంగోలులో మునిసిపల్ వర్కర్స్ యూనియన్

రాష్ట్ర మహాసభ జయప్రదం చేయండి

వినుకొండలో వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - వినుకొండ : ఈ నెల 7 8 తేదీల్లో ఒంగోలులో జరగనున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు బూదాల చిన్న కోరారు. స్థానిక మున్సిపల్ ఆఫీస్ ఆవరణలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. బూదాల చిన్న మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం కనీస పనికి కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ అనుబంధ సం ఘాలైన వాటర్ స్కీం అటెండర్స్, వాచ్‌మెన్ వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఎఐటియుసి ఏరియా అధ్యక్షులు కె.సుభాని, ఆరు వందనం, ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు పెద్దేటి స్వామి, కార్యదర్శి గాలయ్య, నాగూరు, నాగరాజు, రవి, రాముడు, అశోక్ పాల్గొన్నారు.

మద్యం నియంత్రణకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - క్రోసూరు

క్రోసూరులో నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభ

మద్యం నియంత్రణకు చర్యలు చేపడతామని ఎన్నికలకు ముందుకు వైఎస్ జగన్ చేసిన వాగ్దానాన్ని నిల బెట్టుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం క్రోసూరు మండల మహాసభ డిమాండ్ చేసింది. శుక్రవారం స్థానిక ఆమంచి విజ్ఞాన కేంద్రంలో ఏపూరి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన మహా సభలో ఈ మేరకు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ మద్యం షాపుల సంఖ్యను తగ్గిస్తూ, మద్యం ధరలను పెంచడం ద్వారా క్రమంగా మద్య నిషేధాన్ని అమలు చేస్తామని జగన్ ప్రభుత్వం వాగ్దానం చేసిందని, కానీ జరుగుతున్నది అందుకు విరుద్ధంగా ఉందని విమర్శించారు. జంగారెడ్డిగూడెంలో జరగనున్న వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభలో ఈ అం శంపై ప్రత్యేకంగా చర్చించి, కార్య చరణ రూపొందిస్తామని తెలిపారు. వ్యవసాయ కార్మిక కుటుంబాల్లో నూటికి ఇరవైశాతం కుటుంబాలు ఈ మద్యం వల్ల నాశనమవుతున్నా యన్నారు. కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంత రావు మాట్లాడుతూ జంగారెడ్డిగూడెంలో జరుగుతున్న వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభల సందర్భంగా మండలంలోని ప్రతి గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం పతాకాలను ఆవిష్కరించాలని కోరారు. అందుకూరు గ్రామానికి చెందిన అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వం పెద్ద ఆపరేషన్ లను(గర్భసంచి తొలగింపు) ఆరోగ్యశ్రీ నుండి మినహాయించిన కారణంగా వ్యవసాయ కార్మిక కుటుం బాల్లో ఈ ఆపరేషన్ అవసరమైన ఒక్కొక్క కుటుంబానికి రూ.50 వేలు ఖర్చవుతోందని, దీనివల్ల ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరికపాడుకు చెందిన పేతురు మాట్లాడుతూ పని ఒత్తిడి తగ్గిందనే పేరుతో కూలి రేట్లు తగ్గిస్తున్నారని, గ్రామంలో కూలీలు పనులు లేక వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఏపూరి వెంకటేశ్వర్లు అధ్యక్షులుగా, గంటెల చిన్నప్ప కార్యదర్శిగా 9 మందితో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు.

ఇంటిగ్రేటెడ్ హైస్కూల్ ఆధ్వర్యంలో వికలాంగ విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి-నరసరావుపేట

ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక వల్లపచెరువులో ని ఇంటిగ్రేటెడ్ హైస్కూల్ ఆధ్వర్యంలో వికలాంగ విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ నిర్వ హించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ ఏ.పీ.వి నవీన్ కుమార్ మాట్లాడుతూ అంగ వైకల్యం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పట్టణంలో ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. వికలాంగులు, మానసిక వికలాంగుల కోసం పరిశోధన, పునరావాస కేంద్రంగా గుర్తించ బడిన తమ పాఠశాలలో ప్రపంచ వికలాంగుల దినోత్సవం నిర్వహించినట్లు తెలిపారు. సాధారణ విద్యార్థులు, వికలాంగు విద్యార్థులు అంతా సమానమే తన భావన కలిగించేందుకు నేడు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 8న స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరగనున్న వికలాంగుల ఆటల పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు. కళాశాల డైరెక్టర్లు ఏపీవి ఇందిరా దేవి, హరిత ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
గుంటూరు
5
శనివారం 3 డిసెంబర్ 2022

ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర మహాసభ జయప్రదం చేయండి

గుంటూరు జిల్లా నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్ష,కార్యదర్శులుగా రామకృష్ణ, టివిజి రవిశంకర్

ప్రజాశక్తి - గుంటూరు

ఆర్టీసీ సంస్థ ప్రయోజనాలు ఉద్యోగుల ప్రయో జనాలు కాపాడటమే లక్ష్యంగా స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కృషి చేస్తుందని, ఈ నేపథ్యంలో డిసెంబర్ 15, 16 తేదీలలో నెల్లూరు లో జరగనున్న ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేసేందుకు ఉద్యోగులంతా సహకరించాలని ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.సుందరయ్య పిలుపు ఇచ్చారు. విలీనం పేరుతో ఉద్యోగులకు ఆర్టీసీతో ఉన్న పేగుసంబంధాన్ని తెంచి, ఆర్టీసీ నుండి ప్రైవేటీకరణ వైపు నెడుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్త శుద్ధి ఉంటే విద్యుత్ బస్సులు ఆర్టీసీ కే ఇవ్వాలని, ఆర్టీసీ బస్సుల కొనుగోలుకు, నియామకాలకు అనుమతించాలని డిమాండ్ చేశారు. రివర్స్ పీఆర్సీ చేసి ఉద్యోగులకు తీవ్ర నష్టం చేశారని విమర్శించారు. వైద్యం పాత పద్ధతి లో అందించాలని డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లాలో ఫెడరేషన్ బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్.జిలాని బాషా మాట్లాడుతూ విద్యుత్ బస్సులు అన్నీ అద్దెకు తీసుకుని, ఆర్టీసీ ఉద్యోగుల సంఖ్యను కుదిస్తారని తెలిపారు. విలీనం వలన ఆర్టీసీ ఉద్యోగులకు మేలు జరక్కపోగా వేధింపులు పెరిగాయని అన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీ రాం.హరిప్రసాద్ మాట్లాడుతూ ఆర్టీసీలో ఫెడరేషన్ బలోపేతం కావడమే సమస్యల పరిష్కారానికి మార్గం అన్నారు. అనంతరం నూతన కమిటీని,జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా రామకృష్ణ,టివిజి రవిశంకర్, కోశాధికారిగా మధుసూధనరావు, ఎన్నుకున్నారు.

స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - తాడేపల్లి

ప్రెజర్ ఫిల్టర్ కోసం స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే ఆర్‌కె తదితరులు

ఎంటిఎంసి పరిధిలోని పెనుమాక గ్రామంలో నూతన ప్రెజర్ సౌండ్ ఫిల్టర్ నిర్మించడానికి కార్పొరేషన్ అధికారులతో కలిసి శుక్రవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పెనుమాక ప్రజలు తాగునీటి కష్టాలు తీర్చడానికి పూర్తిస్థాయిలో కృషిచేస్తామని హామీనిచ్చారు. 1.5ఎంఎల్‌డి శాండ్ ఫిల్టర్ నిర్మాణంకోసం పెనుమాక, కృష్ణాయపాలెం రోడ్డులోని కొండవీటివాగు వద్ద ఉండవల్లి గుహల సమీపంలో స్థల పరిశీలన జరిపినట్లు తెలిపారు. ఉదయం, సాయంత్రం ప్రజలందరికీ మంచినీరు అందేవిధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను కోరారు. ఈకార్యక్రమంలో డిఈ కృష్ణారెడ్డి, కిశోర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, వైసిపి నాయకులు రేఖా దామేశ్వరరెడ్డి, శివారెడ్డి, బి.నాని పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా గుంటూరు అభివృద్ధి

బ్రాడీపేటలో శంకుస్థాపన కార్యక్రమలో ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరును పూర్తి స్థాయిలో అభివృద్ధిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని శాసన మండలి సభ్యులు లేళ్ళ అప్పిరెడ్డి తెలిపారు. శుక్రవారం 32 వ డివిజన్ కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) ఆధ్వర్యంలో బ్రాడీ పేట ఒకటవ లైన్ 14 వ అడ్డరోడ్ నుండి 7 వ అడ్డ రోడ్డు వరకు నూతనంగా నిర్మించిన సి సి రోడ్డు ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ ప్రజల నమ్మకం, ఆకాంక్ష కు ప్రతి రూపమే జరుగుతున్న అభివృద్ధి-సంక్షేమం అన్నారు. గుంటూరు నగరానికే గుండె లాంటి బ్రాడీ పేటను గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని అప్పిరెడ్డి ధ్వజమెత్తారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రతి డివిజన్‌లో ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి కి బాటలు వేశామన్నారు. బ్రాడీపేట 4 వ లైన్ రూ.50 లక్షలతో డ్రైన్స్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసేరు. డిప్యూటీ మేయర్ షైక్ సజీలా, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవా నంద్,అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్ర నాథ్,గీతా మందిరం చైర్మన్ వెలుగురి రత్నప్రసాద్, తాడేపల్లి విజయకష్ణ,మహేంద్రా గులేచా,తిమ్మరాజు, విజయమాధావి,విజయ రెడ్డి, సత్యవతి, హనుమంతరావు శర్మ,డేవిడ్,పండ్ల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వేతో రైతులకు మేలు : ఎమ్మెల్యే సుచరిత

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

పాస్ బుక్ పంపిణీ చేస్తున్న మేకతోటి సుచరిత

బ్రిటిష్ కాలం తర్వాత నుంచి ఎవరు కూడా భూ రికార్డులను మార్చిన దాఖలాలు లేవని భూమి శాశ్వత పరిష్కారం చూపించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ధైర్యంగా ముందడుగు వేశారని మాజీ మంత్రి ప్రత్తిపాడు ఎమ్మెల్యే సుచరిత అన్నారు. శుక్రవారం ప్రత్తిపాడు మండల పరిధిలోని కొండ జాగర్లమూడి గ్రామంలో వైయస్సార్ శాశ్వత భూహక్కు పత్రాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ప్రజలు వివిధ రకాల భూ సమస్యలతో ఆఫీసుల చుట్టూ తిరిగేవారని ఇప్పుడు అలాంటి సమస్య లేకుండా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అత్యధిక టెక్నాలజీలతో సర్వే ప్రక్రియ చేశారన్నారు. సమస్యలు ఉంటే సమీపంలోని సచివాలయంలో పరిష్కారం దొరుకుతుందన్నారు. జాయింట్ కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రతిపాడు మండలంలో మూడు గ్రామాల్లో సర్వే ప్రక్రియ జరుగుతుందని, ఇప్పటికే డ్రోన్ సర్వే కూడా ముగి సిందన్నారు. ఎమైన అభ్యంతరాలుంటే అధికారు లకు తెలియజేయాలన్నారు. సర్వేకు రైతులు సహకరించాలని ఆమె అన్నారు. తాసిల్దార్ లీల సంజీవ కుమారి మాట్లాడుతూ మొట్ట మొదటిగా పైలెట్ ప్రాజెక్టు కింద కొండ జాగర్లమూడి గ్రామాన్ని ఎంచుకున్నారని, నూతన టెక్నాలజీతో చిన్న చిన్న లోపాలను కూడా అధిగమించామని తెలిపారు. అనంతరం గ్రామాల్లో ఉన్నటువంటి రైతులకు వైఎస్ఆర్ శాశ్వత భూహక్కు పాస్ బుక్కుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అన్నమ్మ, జడ్పిటిసి విప్పాల కష్ణారెడ్డి, గుంటూరు జిల్లా వక్స్ బోర్డ్ చైర్మన్ షేక్ జిలాని, ప్రత్తిపాడు మండల కన్వీనర్ గట్టు విజయ్, ఎంపీటీసీ మెరుగు సుభాషిణి పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరించాలని ఐద్వా వినతి

మహానాడులో సచివాలయ అడ్మిన్‌కు అర్జీ అందజేస్తున్న ఐద్వా నాయకులు, స్థానిక మహిళలు

ప్రజాశక్తి - తాడేపల్లి : తాడేపల్లి పట్టణంలోని మహానాడు 25వ రోడ్డులో స్థానిక ప్రజలను ఇబ్బంది పెడుతున్న మురుగునీటి సమస్యను పరిష్కరించండి బాబో అని ఐద్వా ఆధ్వర్యంలో స్థానికులు స్థానిక సచివాలయంలో శుక్రవారం అర్జీ అందజేశారు. ఎన్నిసార్లు తాము అధికారుల దృష్టికి తీసుకొచ్చినా సమస్య పరిష్కారం చేయడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. మురుగునీరు నిల్వ ఉండటం వలన దోమలు వృద్ధి అవుతున్నాయని, దీంతో రోగాలబారిన పడుతున్నామని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. వాతావరణంలో మార్పుల వల్ల అంటురోగాలు ప్రబలుతాయేమోనని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఐద్వా కార్యదర్శి పి.గిరిజ, మాజీ ఎంపిటిసి ఉషారాణి, మహిళా సంఘం స్థానిక కార్యదర్శి జ్యోతి, ముద్దాడ పద్మ, లక్ష్మి, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

కఠోర పరిశ్రమతో సివిల్స్‌లో విజయం

టుబాకో బోర్డు ఎగ్జిక్యుటీవ్ అధికారి అద్దంకి శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

మాట్లాడుతున్న అద్దంకి శ్రీధర్ బాబు

దేశ భక్తే సివిల్స్ విజయ రహస్యమని, కష్టపడి చదివిన విద్యార్థిని విజయం వరిస్తుందని పొగాకు బోర్డు ఎగ్జిక్యుటీవ్ అధికారి అద్దంకి శ్రీధర్‌బాబు తెలిపారు. శుక్రవారం ఎంటిఎంసి పరిధిలోని కెఎల్ యూనివర్సిటీలో వర్సిటీ ఆర్ట్స్ విభాగం, బిఎ,ఐఎఎస్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా ప్రసంగించారు. సివిల్ సర్వీసెస్‌లో విజయం సాధించడం ఎలా? అనే విషయంపై విధ్యార్థులతో ఆయన మాట్లాడారు. నా మాతదేశం చాలా గొప్పది, నా దేశ పౌరులకు నాకు చేతనైనంతగా సేవచేయాలి అనే విధంగా సివిల్స్‌కు సిద్ధమయ్యే విద్యార్థులు ఆలోచన చేయాలని ఆయన అన్నారు. సాటి మానవుల కష్టాలలో పాలుపంచుకోవాలనే దక్పథం లాంటి భావాలను అభివద్ధి చేసుకుంటే దేశ అత్యున్నత సర్వీసు అయిన సివిల్స్‌లో ఎంపిక అవ్వడం సులభమేనన్నారు. కేవలం పుస్తకాలలో తలమునకలై 12,15 అంటూ గంటలు లెక్కపెట్టుకుని చదవడమే కాకుండా చదివుతున్న విషయం మీద సంపూర్ణ స్పష్టత, పూర్తి అవగాహన కలిగివుండటం విజయానిక సోపానం అవుతుందన్నారు. సివిల్ సర్వెంటుగా ఎంపికయితే, ఎదుర్కోనే కష్టా నష్టాలు, వత్తి నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను ఇప్పటినుండే భూతద్దంలో నుండి చూడకూడదన్నారు. ప్రతి అంశంపట్ల లోతైన అవగాహనను పెంచుకుని, ఆత్మవిశ్వాసంతో ముందుకెళితే విజయం తథ్యమన్నారు. విద్యార్థులు సివిల్ సర్వీసెస్ సంబంధమై అనేక విషయాలపై తమ సందేహాలను శ్రీధర్ బాబును అడిగి నివత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ జి పార్థ సారధి వర్మ, ప్రొఫెసర్ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకట రామ్, ఎం. హెచ్.ఎస్ విభాగ డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు, విభాగాధిపతి డాక్టర్ కె.ఎస్ వెంకటేశ్వర కుమర్ పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి - తాడేపల్లి : పట్టణంలోని ముగ్గురోడ్డు లో కటికెల ఎస్తేరురాణి ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల కట్టుబట్టలతోపాటు అన్ని సామాన్లు కాలి బూడిదయ్యాయి. విషయం తెలుసు కున్న తాడేపల్లి పట్టణ వైసిపి అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డి ఎస్తేరురాణి కుటుంబానికి బియ్యం, కూరగాయలతోపాటు నిత్యవసర సరుకులు అందించారు. ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చు కున్నారు. కార్యక్రమంలో ఎం.ప్రకాష్, బి.శశి, ఆర్.సతీష్, ఎం.మార్కు పాల్గొన్నారు.

టిడిపిలోకి 50 కుటుంబాలు

ప్రజాశక్తి - తాడేపల్లి : కొలనుకొండకు చెందిన వైసిపి నాయకులు గుమ్మనంపాటి రమేష్ ఆధ్వర్యంలో 50 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఉండవల్లి లోకేశ్ నివాసంలో వారికి ఆయన కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపి జాతీయప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మాట్లాడుతూ ప్రజలంతా కలిసి జగన్‌రెడ్డిని ఇంటికి సాగనంపాలని కోరారు. అధికారంలో ఉన్నా తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని అసంతృప్తి చెంది టిడిపిలో చేరామని పలువురు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్ధయ్య, మండల అధ్యక్షి కార్యదర్శులు అమరా సుబ్బారావు, కొల్లి శేషు, కొలనుకొండ అధ్యక్షులు కంచర్ల రంగారావు, కార్యదర్శి బి.నాగరాజు, టి.ఏలియా, జి.రంగారావు, భూపతిరావు పాల్గొన్నారు.

వ్యకాస రాష్ట్ర మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఫిరంగిపురం : వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభ తెలంగాణా రాష్ట్రం జంగారెడ్డి గూడెంలో 7,8,9 తేదీలలో జరుగుతున్నాయని, జయప్రదం చేయాలని వ్యకాస నాయకులు కోరారు. శుక్రవారం మండలంలోని అల్లంవారిపాలెంలో ప్రచారం, పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వ్యకాస నాయకులు మార్పుల వెంగళరెడ్డి, వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణపై జెకెసిలో పోటీలు

ప్రజాశక్తి - గుంటూరు : జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం సందర్భంగా జెకెసి కాలేజీ, ఎకో క్లబ్ ఆధ్వర్యంలో కాలేజీలో వక్తృత్వ, వ్యాసరచన పోటీలు శుక్రవారం నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ ఎస్.శ్రీనివాసరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు పరిసర ప్రాంతాల్లో గాలిలో కాలుష్యం పెరుగుతోందని అన్నారు. దీన్ని నియంత్రించేందుకు విద్యార్థులు అందించాల్సిన సహకారాన్ని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఐనాగేశ్వరరావు పిజి కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్‌కె ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ పి.గోపిచంద్, ఎకోక్లబ్ వైస్ చైర్మన్ కె.సర్జో, డాక్టర్ డేనియల్, డాక్టర్ ఎం.గురవయ్య, వై.అనిత,కుమారి, సిహెచ్ శ్రీలత పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌పై రేపు రౌండ్ టేబుల్

ప్రజాశక్తి -గుంటూరు : ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ పై ఈనె 4 న విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్టు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర రావు తెలిపారు. శుక్రవారం స్థానిక చుట్టుగుంట లోని గుంటూరు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో శంకర్రావు మాట్లాడుతూ ఈ బీసీ రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని, దీనివల్ల అణగారిన, వెనుకబడిన తరగతులకు అన్యాయం జరుగుతుందన్నారు. సామాజిక వెనుకబాటు ఆధారంగా ఇవ్వాల్సిన రిజర్వేషన్లు ఆర్థిక వెనుక పాటు ప్రాతిపదికన ఇవ్వటం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు పునర్ ఆలోచించుకొని ఈ బీసీ రిజర్వేషన్లు ఉపసంహరించు కోవాలని కోరారు. ఈ రౌండ్ టేబుల్ లో 26 జిల్లాల నుండి బీసీ సంఘం నాయకులు. ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని తెలియజేశారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్ , బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లె ఈశ్వరరావు, బిసి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కోలా అశోక్ , రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమంతరావు, బత్తుల శంకర్రావు, నక్కల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

హోమియో వైద్యశిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తెనాలి: స్థానిక కొత్తపేటలోని పాత ప్రభుత్వ వైద్యశాల వెనక వీధిలో ఏర్పాటు చేసిన చెర్వా ఉచిత హెూయిమో వైద్యశిభిరాన్ని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సంరద్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు ఉచిత వైద్యశిభిరం ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. సినీనటులు సత్య ప్రకాష్ మాట్లాడుతూ ప్రాచీన వైద్యంలో హెూమియో వైధ్యానికి ఎంతో ప్రాధాన్యం ఉందని, ప్రజలు ఈ సౌకర్యాన్ని ఉపయోగించు కోవాలన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నశీం, లక్కరాజు సాయి పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలు వేగవంతం చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కే.ఎస్.జవహర్‌రెడ్డి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

జిల్లాల్లో మంజూరు చేసిన ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, ఇప్పటికీ నిర్మాణాలు ప్రారంభించని భవనాల నిర్మాణాలను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కే.ఎస్.జవహర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుండి స్పందన అర్జీల పరిష్కారం, జగనన్న గృహ నిర్మాణాలు, ధాన్య సేకరణ, నాడు-నేడు పనుల పురోగతి, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలు, గడపగడపకు మన ప్రభుత్వం, ఫ్యామిలీ డాక్టర్ విధానం, డాక్టర్ల నియామకం, భూ సర్వే, జాతీయ రహదారులకు భూ సేకరణ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం క్రింద గుర్తించిన ప్రాధాన్యత పనులకు జారీ చేసిన ఆమోద ఉత్తర్వుల మేరకు గ్రౌన్డింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న కాలనీలలో నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. లే అవుట్లలో ఇళ్ళ నిర్మాణాలు ప్రారంభించకపోతే కనుక ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. లే అవుట్లలో అప్రోచ్ రోడ్ల పనులు పూర్తి చేయాలని, ఇళ్ళ నిర్మాణాలు పూర్తయిన జగనన్న కాలనీలలో జల్ జీవన్ మిషన్ ద్వారా మంచి నీటి సౌకర్యం కల్పించాలన్నారు. వ్యవసాయ అధికారులు రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేపట్టి లక్ష్యాలు అధిగమించాలని అన్నారు. మన బడి నాడు నేడు రెండవ దశలో మంజూరు చేసిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, ఫ్యామిలీ డాక్టర్ విధానం పటిష్టంగా అమలు

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, సంయుక్త కలెక్టర్ తదితరులు

చేయడానికి గ్రామాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేయాలని, ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. జాతీయ ప్రాజెక్టుల నిర్మాణం కోసం అవసరమైన చోట్ల భూ సేకరణ వేగవంతం చేయాలన్నారు. స్పందన పిటిషన్లకు సంబంధించి అప్ లోడ్ చేసిన వివరాలతో పాటు దరఖాస్తుదారునితో పాటు తీసిన ఫోటోలు అప్ లోడ్ చేశారా లేదా అనే విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారి ఎప్పటికప్పుడు పరిశీలించాల్సి ఉంటుందని చెప్పారు. కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాల్లో ప్రాధాన్యత క్రమంలో ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సంయుక్త కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, జిల్లా రెవిన్యూ అధికారి, వినాయకం, సిపిఓ ముక్తేశ్వరరావు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు లేకుండా చూడండి

ప్రజాశక్తి-పెదకూరపాడు

పెండింగ్ కేసులు లేకుండా చూడాలని సత్తెనపల్లి సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ విజయభాస్కర్ రెడ్డి కోరారు. సంవత్సర సాధారణ తనిఖీలు భాగంగా పెదకూరపాడు పోలీస్ స్టేషన్ ను శుక్రవారం పరిశీలించారు. కేసులు మీద, పెండింగ్ దర్యాప్తు అంశాలపై, శాంతిభద్రతల అంశాల పైన పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ రికార్డ్స్ ను తనిఖీ చేశారు. ఈ ఇన్స్పెక్షన్ కార్యక్రమంలో పెదకూరపాడు సర్కిల్ సిఐ వీరాస్వామి, పెదకూరపాడు పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ కృష్ణారావు, ఎస్సై సత్యనారాయణ, పోలీస్ స్టేషన్ సిబ్బంది , మహిళ పోలీసులు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలించిన ఆర్డీవో

ప్రజాశక్తి - ముప్పాళ్ల

మండల తహశీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం సత్తెనపల్లి ఆర్డీవో రాజకుమారి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అదే విధంగా నిర్మాణంలో ఉన్న నూతన తహశీల్దార్ భవనాన్ని ఆమె పరిశీలించి తహశీల్దార్ కు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటుకు నమోదు చేసుకొని ఓటు హక్కు పొందాలన్నారు. తహశీల్దార్ భవానీ శంకర్,డిటి లక్ష్మీ ప్రసాద్, విఆర్వోలు తదితరులు పాల్గొన్నారు

నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయండి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

బొప్పూడిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడు అదనపు తరగతి గదుల నిర్మాణపనులను జడ్పి టిసి కె.సుధారాణి, చిలకలూరిపేట మండల పరిషత్ అధ్యక్షులు దేవినేని శంకరరావు శుక్రవారం పరిశీలించారు. నాడు-నేడు రెండో ఫేజ్‌లో రూ.84 లక్షల వ్యయంతో ఈ తరగతి గదులను నిర్మిస్తున్నారు. జడ్పిటిసి మాట్లాడుతూ అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

నాదెండ్లలో ఫ్రైడే డ్రైడే తనిఖీ

ప్రజాశక్తి-నాదెండ్ల:

ఫ్రైడే డ్రై డే తని ఖీల్లో భాగంగా పల్నాడు జిల్లా డిఎంహెచ్ఓ శోభారాణి నాదెండ్ల పిహెచ్ఈ సెంటర్ పరిసర ప్రాంతాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఇళ్ల వద్ద శుభ్రంగా ఉండాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ,ప్రతిఒక్కరూ శుభ్రత పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డిఎంఓ రవీంద్ర రత్నాకర్, డిఐఓ అంజలి, డాక్టర్లు నెహ్రూ, నాగేశ్వరరావు ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. యడ్లపాడు: పల్నాడు డిఎంఓ ఫ్రైడే డ్రైడేను పురస్కరించుకొని కె.రవీంద్రరత్నాకర్ తిమ్మాపురం ఎస్సీ కాలనీలో పర్యటించారు. మలేరియా, డెంగీ వ్యాప్తి నివారణ పద్ధతులను వివరించారు. యడ్లపాడు హెచ్ఎస్ రాజశేఖర్, చిలకలూరిపేట సబ్‌యూనిట్ ఆఫీసర్ ఆర్‌సిహెచ్ నారాయణ, ఎస్‌వి.చలమారెడ్డి, బిఎస్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

దాట్లవారిపాలెంలో బ్రిడ్జి ప్రారంభం

ప్రజాశక్తి-నూజెండ్ల : మండలంలోని తలార్లపల్లి, గ్రామ సచి వాలయం పరిధిలో దాట్లవారి పాలెంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. డ్రైనేజ్, సైడ్ కాలువల సమస్య ఉందని, ఎప్పుడో వేసిన కరెంటు స్తంభాలు కుం గిపోతున్నాయని వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయించాలని, ఒక లైబ్రరీని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు ప్రజలు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, దాంట్లవారి పాలెంలో బ్రిడ్జిని ప్రారంభించడం తనకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. గ్రామ రైతులకు ఈ బ్రిడ్జి చాలా ఉపయోగంగా ఉంటుందన్నారు.మాజీ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు రైతులపై కపట ప్రేమ చూపిస్తున్నారంటూ మండి పడ్డారు. సురక్షిత మంచినీరు అందించేందుకే జల జీవన్ మిషన్ పథకం కింద సుమారు 2 కోట్ల 20 లక్షల రూపాయలు నిధులు ప్రభుత్వం తరపున మంజూరు చేశామని, ఈ పనులను వేగంగా పూర్తి చేస్తామన్నారు. మండలంలోని ముక్కెళ్ళపాడులో శుక్రవారం అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట ధ్వజ స్తంభ ప్రతిష్ట మహోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు స్వామివారిని దర్శించుకున్నారు.

రావిపాడులో 'గడపగడపకు'

ప్రజాశక్తి - నరసరావుపేట: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు జరుగుతున్న తీరు స్థానికంగా నెలకొన్న సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకే ప్రభుత్వం గడపగ డపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మ కంగా నిర్వహిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని రావిపాడు ఎస్సీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నిర్వహించారు.

ఏ వర్గాన్నీ వదలకుండా దోపిడి: మాజీ ఎమ్మెల్యే జీవీ

ప్రజాశక్తి - వినుకొండ

కరెంటు, ఆర్టీసీ చార్జీలు, ఇంటి పన్ను పెంపు, పెట్రోల్ డీజిల్ ధరలు అధిక రేట్లు, నిత్యవసరాల ధరలు పెంపు, చెత్త పన్ను, ఆస్తి పన్ను అంటూ అన్ని పనులు వసూళ్లు చేస్తూ జగన్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో ఏ వర్గాన్ని వదలకుండా దోపిడీ చేస్తున్నారని, ఒక్కసారి అవకాశం అంటే నమ్మి ఓటేసినందుకు రాష్ట్రానికి ఇదేమి కర్మ అని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. వినుకొండ మండలం లోని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆకుమల్ల కాసిం ఆధ్వర్యంలో దొండపాడు లో 'ఇదేమి కర్మ' కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. జగన్ రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాలను దోచుకుంటూ రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న ఈ దుష్టపాలనను ప్రజా కోర్టులో నిలబెట్టి సరైన బుద్ధి చెప్పడం ఖాయమ న్నారు.

వైసిపి విధానాలతో తలబాదుకుంటున్న ప్రజలు

ప్రజాశక్తి-నరసరావుపేట

ఒక్క ఛాన్స్ అంటూ వచ్చి అధికారంలో చేపట్టిన వైసిపి విధానాలతో విసుకు చెందిన ఆంధ్ర రాష్ట్ర ప్రజలు 'ఇదేం కర్మ' అంటూ తలబాదుకుంటున్నారని టిడిపి నరసరావుపేట నియోజకవర్గ బాధ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు అన్నారు. శుక్రవారం స్థానిక సాయి నగర్ 1వ వార్డులో 'ఇదేం కర్మ' కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా వార్డులోని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు.

అంకితభావంతో పని చేయండి: ఎమ్మెల్యే పిన్నెల్లి

ప్రజాశక్తి - మాచర్ల

పదవి అధికారం కాదని, బాధ్యతగా తీసుకొని ప్రజలకు అందుబాటులో ఉంటూ పట్టణాభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక పురపాలక శాఖ కార్యాలయంలో కౌన్సిల్ హాల్‌లో శుక్ర వారం బోయ రఘురాంరెడ్డి ఇంచార్జి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించే కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇప్పటివరకు మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఉన్న రఘురామిరెడ్డి చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన తురక కిషోర్ సెలవుపై వెళ్లడంతో ఇన్‌ఛార్జి చైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు ఈ సందర్భంగా రఘురాం రెడ్డికి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో పార్టీ చేసుకున్న ఒప్పందాల మేరకే రఘురామిరెడ్డి ఇప్పుడు ఇన్‌ఛార్జి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్నారన్నారు. రఘురామిరెడ్డి మాట్లాడుతూ అందరిని కలుపుకొని వెళతానని, పట్టణాభివృద్ధికి పాటుపడ తానన్నారు. మున్సిపల్ కమిషనర్ రమణబాబు, రెండవ వైస్ చైర్మన్ కె.నరసింహారావు, మాజీ చైర్మన్ టి.కిషోర్, తదితరులు పాల్గొన్నారు

సచివాలయం,రైతు భరోసా,విలేజ్ క్లినిక్ భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మహాత్మ గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గ్రామాలలో మౌలిక సదుపాయాలు చేపట్టారని ప్రభుత్వ విప్,మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గ్రామంలో పలు అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విజయపురిసౌత్‌లో రూ.40 లక్షల వ్యయంతో సచివాలయం, రూ.26 లక్షలతో రైతుభరోసా కేంద్రం, రూ.25 లక్షలతో విలేజ్ క్లినిక్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌పై ప్రశంసలు కురిపించిన ఆయన, టిడిపి అధినేత చంద్రబాబునాయు డుపై విమర్శలు గుప్పించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ సాయిమార్కొండా రెడ్డి, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు శేరెడ్డి గోపిరెడ్డి, మాచర్ల జెడ్పీటీసీ మల్లుస్వామి తదితరులు పాల్గొన్నారు.

రిక్రియేషన్ క్లబ్ గ్రామానికే చెందేలా చర్యలు

స్థానిక నాగార్జున రిక్రియేషన్ క్లబ్ ప్రజలందరికీ ఉపయోగపడేలా, గ్రామానికి చెందేలా చర్యలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం విజయపురిసౌత్‌లోని పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయనను ఎమ్మార్పీఎస్ నాయకుడు ఊరే మార్క్‌తో పాటు స్థానికులు కలిశారు. నాగార్జున రిక్రియేషన్ క్లబ్ గ్రామానికి కేటాయించాలని విన్నవించారు. రిక్రియేషన్ క్లబ్ కు, ఏపిఆర్ డిగ్రీ కాలేజీ మధ్య గోడ నిర్మించి ప్రజలకు చెందేలా చర్యలు తీసు కోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

సాగర్ జలాశయంలోకి చేప పిల్లలు విడుదల

స్థానిక లాంచ్ స్టేషన్ వద్ద ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా శుక్రవారం నాలుగు లక్షల చేపల పిల్లలను నాగార్జునసాగర్ జలాశయంలోకి విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, చేప పిల్లల విడుదల మత్స్యకారుల జీవనాభివృద్ధికి వారి ప్రగతికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కండా రెడ్డి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు షేరెడ్డి గోపిరెడ్డి, మాచర్ల జడ్పిటిసి మల్లు స్వామి,కొత్తపల్లి సర్పంచ్ ఓరుగంటి జయప్రకాష్ రెడ్డి, మత్స్యకారుల సంఘ ప్రెసిడెంట్ కారే ముసలయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో సమగ్ర ప్రణాళికలు

జెడ్పీ సీఈవో శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి -గుంటూరు

క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని జిల్లా పరిషత్ సీఈవో జి .శ్రీనివాసరెడ్డి అన్నారు. గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై గుంటూరు రూరల్ మండలంలోని వెంగలాయపాలెం, తురకపాలెం, ఓబులు నాయుడుపాలెం పంచాయతీ సర్పంచులు, ఎంపీటీసీలు , పంచాయతీ కార్యదర్శులు, ఇతర సచివాలయ సిబ్బందికి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరుగుతున్న శిక్షణను శుక్రవారం ఆయన సందర్శించారు. ఎంపీడీవో జె. శోభారాణి అధ్యక్షతన జరిగిన శిక్షణ కార్యక్రమంలో జడ్పీ సీఈవో మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి పటిష్టమైన ప్రణాళికలు అవసరమన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు, విలేజ్ ఫండ్స్ ను ఉపయోగించుకుని గ్రామాలను అభివృద్ధి బాటలో నిలపాలని కోరారు. శిక్షణలో ఎంపీడీవో శోభారాణి విస్తరణాధికారి కే . శ్రీనివాసరావు సంబంధిత శాఖల అధికారులు ప్రసంగించారు.

ప్రజాశక్తి - ఫిరంగిపురం

ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 113 తాళ్లూరు, తక్కెళ్లపాడు, ఎర్రగుంట్లపాడు, సిరంగిపాలెం సర్పంచ్‌లు, ఎంపిటిసిలకు ఎంపిపి కార్యాలయంలో ఒక్కరోజు శిక్షణా తరగతిని శుక్రవారం నిర్వహించారు. వివిధ అభివృద్ధి పనులు, నిధులు, విధుల గురించి నిర్వహించిన శిక్షణా కార్యాక్రమానికి ఎంపిడిఒ అనురాధ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జిల్లా స్థాయిలో మండల ప్రత్యేక అధికారి పిడి యుగంధర్ కుమార్, ఇఒపిఆర్‌డి ఎం.ఎన్.ఎల్ కుమారి, భీమవరం గ్రామ కార్యదర్శి జి వి ఆర్ కె మూర్తి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి- మేడికొండూరు : గ్రామపంచాయతీల అభివద్ధిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొట్లాది రూపాయల నిధులను హెచ్చించి, పలు రకాల సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టాయని వాటిని ఉపయోగించి గ్రామాల అభివద్ధికి అధికారులు ప్రణాళికలు రచించాలని మేడికొండూరు జడ్పిటిసి సభ్యులు కందుల సిద్దయ్య తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ పంచాయితీల అభివద్ధి ప్రాణాళికలలో భాగంగా కేంద్ర, రాష్ట ప్రభుత్వాల ఆదేశాలతో ఈనెల 2 నుండి 7 వరకు గ్రామపంచాయతీ డెవలప్మెంట్ పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎంపిపి మన్నవ స్వప్న, తహశీల్దార్ జి కరుణకుమార్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రవిబాబు పాల్గొన్నారు.

రేపు అవగాహన సంస్థ ఆధ్వర్యంలో

సీజనల్ వ్యాధులపై ఆరోగ్య సభ

ప్రజాశక్తి - గుంటూరు

అవగాహన సంస్థ గత ఏడు సంవత్స రాలుగా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఆరోగ్య సభలో భాగంగా ఆదివారం క్రిటికల్ కేర్,సీజనల్ వ్యాధులపై, షుగర్, థైరాయిడ్ వ్యాధులపై ఆరోగ్య సభ నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంస్థ కార్యాలయంలో నిర్వహించే ఆరోగ్య సభను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

విశ్రాంత ఉద్యోగి విరాళం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిజిహెచ్ అభివృద్ధి కోసం దాతలు చేయుత ఇవ్వడం అభినందనీయమని సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి అన్నారు. విశ్రాత ఉద్యోగి డాక్టర్ జయరామ నాయుడు ఎముకలు కీళ్ల విభాగానికి ఉపయోగపడే రెండు వైద్య పరికరాలను డాక్టర్ ప్రభావతికి శుక్రవారం అందచేశారు. ఈ సందర్భంగా దాతను ఆమె కొనియాడారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

దుగ్గిరాల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ డిఎస్ రూపవాణి

పెదనందిపాడు సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ టి హెబ్సిబా

మిగులు బడ్జెట్‌కు ఆమోదం

ప్రజాశక్తి - దుగ్గిరాలు

ఏకాభిప్రాయంతో బడ్జెట్ పెట్టుకోవాలని ఎంపిపి దానబోయిన సంతోషం రూపవాణి కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం ఎంపిపి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాలలో ఉన్న సమస్యలు సభ దష్టికి తీసుకురావాలన్నారు. జెడ్పిటిసి మేకతోటి అరుణ మాట్లాడుతూ సర్వసభ్య సమావేశం ద్వారా మండలంలోని సమస్యలు సత్వరంగా పరిష్కరించుకోవ చ్చన్నారు. ఎంపిడిఒ కుసుమ శ్రీదేవి బడ్జెట్ వివరాలను తెలిపారు. 2022- 23 సంవత్సరానికి ఆదాయం రూ.15,15,95,000 వ్యయం రూ.15,13,15,000 మిగులు రూ. 2,44,000 బడ్జెట్ ను ఆమోదించారు. 2023 24 సంవత్సరానికి ఆదాయం రూ.15,44,95,000 వ్యయము రూ.15,44,15,000 మిగులు రూ. 80,000 రూపాయల బడ్జెట్‌ను ఆమోదించారు.ఎస్సీలకు 15, మహిళ మరియు శిశు పరిరక్షణకు 15, ఎస్టీలకు 6, తాగునీటికి 12, ఇతర అభివృద్ధి కార్యాక్రమాలకు 10శాతం, మండల పరిషత అసెస్‌మెంట్, మెయిన్‌టనెన్స్‌కు 35శాతం కేటాయించారు. అత్యవసర పరిస్థిలో తాగునీటికి అదనంగా ఖర్చు చేయవచ్చని తీర్మానించారు. వ్యవసాయశాఖాధికారి పి శిరీష మాట్లాడుతు మండలానికి ఐదు డ్రోన్లు మంజూరయ్యాయని, రైతులు ఒక యూనిట్‌గా ఏర్పడి సబ్సిడీ ద్వారా పొందవచ్చున్నారు. రూ. 10 లక్షల డ్రోను రూ.4లక్షల సబ్సిడీ పొందవచ్చన్నారు. ఎంపిటిసి తాళ్ల అశోక్ మాట్లాడుతు గత సంవత్సరం రైతులు ఆర్‌బికెలకు తరలించిన ధాన్యం రవాణా ఖర్చులు ఇంత వరకు అందలేదన్నారు. పెనుమూలి సర్పంచ్ మాట్లాడుతు మంచినీటి ట్యాంకును 24 గంటలు విద్యుత్ సరఫరా చేయాలని కోరగా, పెద్దపాలెం సర్పంచ్ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు 3వ లైన్ ఏర్పాటు చేయాలన్నారు. జలవనరుల శాఖ డిఎ ఎస్ కెవి ప్రసాద్ మాట్లాడుతు మొండి గుర్రపు డెక్క నివారించాలంటే కాల్వలో పూర్తిగా నీటి స్థాయి ఆపాల్సి ఉన్నందున, వచ్చే వేసవిలో నివారణా చర్యలు చేపడతామన్నారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు

అభివృద్ధి, సంక్షేమం దిశగా తమ పాలన కొనసాగుతుందని ఎంపిపి తమలపాకుల హెప్సీబా తెలిపారు. శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఆమె అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా హెప్సీబా మాట్లాడుతు ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు చేరేలా చూస్తున్నామన్నారు. అనంతరం లింగవివక్ష, లైంగిక వేధింపులు, గృహహింసలకు వ్యతిరేకంగా ఎంపిపి ఎం సుబ్బారావు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ షేక్ సుబాని, ఇంచార్జి ఎంపిడిఒ ఎస్ సాయిలీల, ఉప ఎంపిపి షేక్ ఖాసిబి, పాల్గొన్నారు.

విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పంపిణి

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

పొన్నూరు మండలం చింతలపూడి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నందు 10వ తరగతి విద్యార్థి విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించుటకు గాను జగనన్న విద్యా జ్యోతి స్టడీ మెటీరియల్ పాఠశాల విద్యా కమిటీ చైర్ పర్సన్ పి. అరుణ విద్యా కమిటీ నెంబర్లు ఏ. పద్మావతి,డి ధనలక్ష్మి, వారి ద్వారా పంపిణీ చేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అడపా పద్మలత ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలకు తప్పని ఇబ్బందులు : కోవెలమూడి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వైసిపి పాలనలో ప్రజలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పశ్చిమ నియోజకవర్గం ఇన్‌ఛార్జి కోవెలమూడి రవీంద్ర (నాని) అన్నారు. శుక్రవారం స్థానిక వేలంగిణీ నగర్‌లో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' అను కార్యక్రమాన్ని వేళంగిని నగర్‌లో ప్రారంభించి ప్రజా సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలు, లభించని ఇసుక, పెరిగిన సిమెంటు, పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ ధరలు, ఇష్టానుసారంగా పెంచిన కరెంటు బిల్లులు, ఇంటి పన్నులు, బస్సు చార్జీలను పెంచడం పరిశీలిస్తే దుర్మార్గపు పాలన అర్థం అవుతుందన్నారు. రాష్ట్రాన్ని రాజధాని లేని రాష్ట్రంగా చేశారని ఎద్దేవా చేశారు.

నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్, మద్దిరాల మ్యాని, తెలగతోటి సుధీర్, సాల్మట్టి మార్క్, దాసరి శంకర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీపార్క్‌కు ఇదేం ఖర్మ : నసీర్ అహ్మద్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు గాంధీ పార్కును రూపరేఖలు మార్చి ఎందుకు ఉపయోగం లేకుండా చేశారని టిడిపి తూర్పు నియోజకవర్గం ఇన్‌ఛార్జి మహ్మద్ నశీర్ అహ్మద్ అన్నారు.

టిడిపి పిలుపు మేరకు "ఇదేం ఖర్మ మన గాంధీ పార్క్ కి " అంటూ మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి అనంతరం గాంధీ పార్క్ వద్ద, కూరగాయల మార్కెట్ వ్యాపారస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నశీర్ మాట్లాడుతూ వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని అన్నారు.నగర ప్రజలు, సామాన్య ప్రజలకు ఆహ్లాదన్ని ఇచ్చే ఏకైక గాంధీ పార్కు ను మూడు సంవత్సరాల నుండి వైసిపి ప్రభుత్వం, నగర పాలక సంస్థ అధికార పక్షం పాడపెట్టి గాంధీ పార్కులో ఉన్న వస్తువులు అమ్ముకున్నారని నసీర్ తెలిపారనగర పార్టీ అధ్యక్షులు

డేగల ప్రభాకర్, రాష్ట్ర పార్టీ కార్యదర్శి చిట్టిబాబు, కార్పొరేటర్లు పోతురాజు సమత, భారతి, ఎల్లవుల అశోక్ పాల్గొన్నారు.

నిబంధనలు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు

ప్రజాశక్తి - కొల్లిపర : నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలను సాగిస్తున్నారంటూ జనసేన జిల్లా అధ్యక్షుడు గాదే వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోనిలోని బొమ్మువానిపాలెం ఇసుక రీచ్‌ని జన సైనికులతో కలిసి పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వము టన్ను ఇసుక ధర రూ . 475 అంటూ ఆర్భాటంగా పత్రిక ప్రకటనలు ఇస్తూ, అందుకు విరుద్ధంగా రూ. 625 వసూలు చేస్తున్నారంటూ విమర్శించారు. ప్రభుత్వము ఎస్సీ ఎస్టీలకు ఇచ్చిన పొలాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ లోతుతో ఇసుక తీయడం వలన వరదలు వచ్చినప్పుడు ప్రవాహానికి పొలాలు కొట్టుకుపోతున్నాయని రైతులు వాపోతున్న పట్టించుకోవ డం లేదని విమర్శించారు. కార్యక్రమంలో కొల్లిపర మండల పార్టీ అధ్యక్షులు వెంకయ్య నాయుడు, పసుపులేటి మురళీకష్ణ, బండారు రవికాంత్ పాల్గొన్నారు.

పెదనందిపాడులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఏవో సుధారాణి

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి - పెదనందిపాడు

పెదనందిపాడు మండలంలోని పవిడివారిపాలెం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం శుక్రవారం ఎఒ బి సుధారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.వరి ఏ గ్రేడ్ ధాన్యం 75 కేజీల బస్తా రూ.1545, సాధారణ రకం రూ. 1530లకు కొనుగోలు చేస్తామన్నారు. తేమ 17శాతం లోపు ఉండాలని, ఇతర నాణ్యతా ప్రమాణాలు పాటించాలని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పమిడి సీతారత్నం, విఎఎ జి సాయిరాం, జిడిసి ఎం ఎస్ సిబ్బంది కె అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి- మేడికొండూరు : మండల కేంద్రమైన మేడికొండూరు రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారి మన్నవ నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ వరి వేసిన రైతులు అందరూ ఆర్‌బికెలో తెలియ జేయాలని అన్నారు. మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తా మని, మండలంలోని అన్ని గ్రామాలలో వరి పంట సాగు చేస్తు న్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

స్నేహహస్తాలు సంస్థ వితరణ

ప్రజాశక్తి -మేడికొండూరు

నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రాజ్ కుమార్

మేడికొండూరు లక్ష్మీనరసింహా కాలనీ ఎంపిపి పాఠశాలలో స్నేహ హస్తాలు స్వచ్ఛంద సంస్థ శుక్రవారం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ దేవరకొండ రాజ్ కుమార్ విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేసి, మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఇలాంటి ఉచిత సహాయము సంతోషించదగ్గ అంశం అని అన్నారు. గత ఆరు సంవత్సరాలుగా ఈ పాఠశాలలో ఉచి తంగా నోటు పుస్తకాలు పంపిణీ, జిల్లాలో పలు పాఠశాల ల్లో పుస్తకాలు, ఆటవస్తువులు పంపిణీ చేస్తున్న స్నేహ హస్తాలు సంస్థ వితరణను కొనియడారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ విన్నకోట రమేష్, పాఠశాల ప్రధానోపా ధ్యాయులు, అధ్యాపకులు రఘు కుమార్ పాల్గొన్నారు.

తెలుగువారి గుండెచప్పుడు ఘంటసాల

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో శత జయంతి

ప్రజాశక్తి - గుంటూరు

మహా గాయకుడు ఘంటసాల తెలుగువారి గుండెచప్పుడని, ఆయన పాట తెలుగుదనానికి చిరునామా అయ్యిందని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం వారి కార్యాలయంలో నిర్వహించిన ఘంటసాల శత జయంతి వేడుకల్లో వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గాయకులు, కళాకారులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆలిండియా ఘంటసాల చైతన్య సమితి అధ్యక్షులు కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతు తెలుగు తల్లి గారాల పుత్రుడు, తన జీవితమే ఒక సందేశంగా జీవించిన వాడు, తెలుగు భాషలోని తీయదనాన్ని పాలగా ఆలపించినవాడు ఘంటసాల అని కొనియాడారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఘంటసాల శత జయంతి వేడుకలు కొనసాగుతున్నాయన్నారు. గాయకుడు మేధావుల ఫోరం కన్వీనర్ పిఎస్ మూర్తి మాట్లాడుతు తెలుగు పాట ఉన్నంతవరకూ ఘంటసాల గానం ఉంటుందన్నారు. నేటి తరం ఘంటసాల గానం ద్వారా తెలుగు భాష మాధుర్యాన్ని తెలుసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో గాయకులు రాజశేఖర్, డి వెంకటేశ్వర్లు, డి సాయిబాబు, పింగళి భాగ్య లక్ష్మి ఘంటసాల పాటలను ఆలపించారు.

ఓటు హక్కు నమోదుకు 8వ తేదీ ఆఖరు

- విద్యార్థులంతా దరఖాస్తు చేసుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి
- కాలేజీ యాజమాన్యాలు, అధికారులతో సమీక్షలో గుంటూరు జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - గుంటూరు

ఓటు హక్కు కోసం 18 ఏళ్లు నిండిన విద్యార్థులంతా దరఖాస్తు చేసుకునేలా విద్యాసంస్థల యాజమాన్యాల సహకారంతో ఇఆర్వోలు, ఎఇఆర్వోలు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్-2023లో యువ ఓటర్ల నమోదుపై కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణశర్మతో కలసి ఇఆర్వోలు, ఎఇఆర్వోలు, యూనివర్సిటీలు, కళాశాల యాజమాన్యాలతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జూనియర్, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలు, యూనివర్సిటీల్లో విద్యార్థులతో ఓటు హక్కు నమోదుకు ప్రత్యేక క్యాంపుల నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. 8వ తేదీతో గడువు ముగుస్తుందని, ఇప్పటికే కొన్ని కాలేజీల్లో అవగాహన కల్పించి ఓటరుగా నమోదు కోసం ఫారం 6ను అందించామని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలకు చెందిన 171 జూనియర్ కళాశాలలోను, 256 డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలోను ప్రత్యేకంగా ఓటరు నమోదు క్యాంపులను శనివారం నుంచి ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి విద్యాసంస్థకు ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించామని, దరఖాస్తులను ఎక్కడికక్కడే ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. ఓటరుగా నమోదై ఎపిక్ కార్డులు వచ్చిన తరువాత విద్యాసంస్థల్లోనే విద్యార్థులకు అందించాలన్నారు. 17 నుండి 18 ఏళ్ల వారిని ముందస్తుగా ఓటు హక్కు కోసం వివరాలను నమోదు చేయించాలన్నారు. విద్యార్థులు ఓటరుగా నమోదుకు అవసరమైన ధ్రువపత్రాలు, ఫొటో తెచ్చేలా కాలేజీల్లో విస్తృత ప్రచారం, పోస్టర్లు ఏర్పాటు చేయాలని యాజమాన్యాలకు సూచించారు. ఓటరు నమోదు బాగా నిర్వహించిన విద్యాసంస్థలకు జనవరి 26న జరిగే రిపబ్లిక్ డేలో జ్ఞాపికలు ఇస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లలితా, డిప్యూటీ కలెక్టర్ మోవిడి వాణి, సాయిశ్రీ, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, కలెక్టరేట్ కో-ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ సిద్ధార్థ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్

నేడు, రేపు ఓట్ల నమోదు, మార్పులు

ఓట్ల నమోదుపై గుంటూరు నగరంలో శని, ఆదివారాల్లో ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తామని కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన జారీ చేశారు. తూర్పు, పశ్చిమ నియోజక వర్గాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 3, 4 తేదీల్లో బిఎల్‌ఒలు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. అర్హులు నిర్ధిష్ట ధ్రువపత్రాలు ఇచ్చి నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే ఓటు మార్పులు, చేర్పులు, తొలగింపులు, చిరునామా మార్పులపై దరఖాస్తులు తీసుకుంటారని తెలిపారు.

విద్యార్థులు తమను తాము మలచుకోవాలి

పదో తరగతి విద్యార్థులకు అవగాహనలో భాష్యం రామకృష్ణ

ప్రజాశక్తి - గుంటూరు

విద్యార్థి జీవితం ఎంతో విలువైనదని దీనిని గుర్తెరిగి లక్ష్యసాధనతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ ఉద్బోధించారు. 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలు రానున్న నేపథ్యంలో గోరంట్ల భాష్యం టెన్త్ క్యాంపస్‌లో శుక్రవారం అవగాహన కల్పించారు. క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ఎంతటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని, ప్రతి విద్యార్థి స్వీయ ప్రేరణతో తమను తాము మలుచుకోవాలని అన్నారు. మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని సమాజానికి సేవలందించాలని కోరారు. విద్యార్థి జీవితమంటేనే అన్ని భావోద్వేగాల కలయికని, దీనిని ఆనందంగా తీర్చిదిద్దుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. మంచి-చెడు విచక్షణ పాటించాలని, పెద్దల పట్ల గౌరవంగా మెలగాలని, వారి నమ్మకాన్ని నిలబెట్టాలని సూచించారు. పరీక్షలకు ఎలా సిద్ధమవ్వాలో దిశానిర్దేశనం చేస్తూ వారిలో మనోధైర్యాన్ని నింపేందుకు ప్రతిఒక్కరితో ఫొటోలు దిగారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల సలహాదారు మైఖేల్ రాజు, జఓ, ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డాక్టరేట్ అందుకుంటున్న చల్లా శ్యామలాదేవి

కళ్లం అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - గుంటూరు : కళ్లం హరనాథరెడ్డి ఇనిస్టిట్యూడ్ ఆఫ్ టెక్నాలజీలో ఎంబిఎ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ చల్లా శ్యామలాదేవికి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. 'ఇంపాక్ట్ ఆఫ్ మార్కెటింగ్ స్ట్రాటజీస్ ఆన్ క్రాస్ బైయింగ్ ఇంటెన్షన్ ఆఫ్ కస్టమర్స్ టువార్డ్స్ ఫైనాన్సియల్ సర్వీసెస్ ఇన్ బ్యాంకింగ్ సెక్టార్' అంశంపై పరిశోధన చేసినందుకుగాను శ్యామలాదేవి డాక్టరేట్‌ను అందుకున్నారు. పరిశోధనకు డాక్టర్ ఎ.కనకదుర్గ గైడ్‌గా వ్యవహరించారు. శ్యామలాదేవిని కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకరరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బిఎస్‌బి రెడ్డి, విభాగాధిపతి డాక్టర్ ఇర్షాద్, అధ్యాపకులు అభినందించారు.

రెజ్లింగ్ రాష్ట్రస్థాయి పోటీలకు జైభారత్ విద్యార్థులు

ప్రజాశక్తి - క్రోసూరు

మండల కేంద్రమైన క్రోసూరులోని జై భారత్ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు పి.లక్ష్మీ జస్విత, ఎస్.జోసెఫ్ రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ (కుస్తీ) పోటీలకు ఎంపికైనట్లు విద్యా సంస్థల డైరెక్టర్ టి.జైనేంద్రారెడ్డి తెలిపారు. ఈ మేరకు విద్యార్థులకు శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అభినందించారు. ఈ సందర్భంగా జైనేంద్రారెడ్డి మాట్లాడుతూ అచ్చంపేటలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ఆవరణంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అండర్-14, అండర్-17 బాల, బాలికల జిల్లా స్థాయి రెజ్లింగ్ ఎంపికలు తమ విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. అండర్-14 విభాగంలో ఎస్.జోసెఫ్, అండర్-17 విభాగంలో పి.లక్ష్మీ జస్విత చక్కని ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. తిరుపతిలో ఈ నెలలో నిర్వహించే పోటీల్లో పాల్గొటారని, అక్కడా ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. గత నెలలో జై భారత్ స్కూల్ నుండి రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు, జిల్లా స్థాయి కబడ్డీ జట్టుకు విద్యార్థులు ఎంపికయ్యారని గుర్తు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఖదీర్‌బాబ, పిఇటి కె.స్వాతి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేటి ఉద్యోగుల స్పందన రద్దు

ప్రజాశక్తి - గుంటూరు : ప్రతి నెల మొదటి శనివారం నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల స్పందన కార్యక్రమాన్ని అనివార్య కారణాల వల్ల ఈ శనివారం రద్దు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాగానికి సహకరించాలని కోరారు..

8న తెనాలి రానున్న చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - తెనాలి: టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ఈనెల 8న తెనాలి రానున్నట్లు మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. తొలుత 7వ తేదీగా ప్రకటించినా పర్యటనలో మార్పులు చేసి 8వ తేదీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'లో పాల్గొనేందుకు చంద్రబాబు వస్తున్నట్లు చెప్పారు. తొలుత టిడిపి జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్‌తో కలిసి పట్టణంలో చంద్రబాబు పర్యటించేందుకు వీలైన మార్గాలను పరిశీలించారు. ఏర్పాట్లపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో నాయకులు దాసరి రాజా మాస్టారు, ఎ.జయలక్ష్మి, మహమ్మద్ కుద్దూస్, జె.మహేష్, టి.హరిప్రసాద్ పాల్గొన్నారు.

80 అడుగులకు రెడ్డిపాలెం డొంక రోడ్డు విస్తరణ

- రెండు దశల్లో పనులకు ప్రణాళికలు రూపొందించాలి
- కార్పొరేషన్ ఉద్యోగులకు కమిషనర్ ఆదేశం

ప్రజాశక్తి - గుంటూరు

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

ఇన్నర్ రింగ్ రోడ్ నుండి సంజీవయ్య నగర్ రైల్వే గేటు వరకు వచ్చే రెడ్డిపాలెం డొంక రోడ్‌ను 80 అడుగులకు రెండు దశల్లో విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. ఈ మేరకు తన ఛాంబర్‌లో పట్టణ ప్రణాళిక అధికారులతో శుక్రవారం సమీక్షించారు. నగరంలో రోజురోజుకూ ట్రాఫిక్ పెరుగుతోందని, అందుకు తగిన విధంగా ప్రధాన రహదార్లను విస్తరించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇప్పటికే ప్రధానమైన నందివెలుగు, కొత్తపేట శివాలయం, పెద్ద పలకలూరు రోడ్ల పనులు నగరపాలక సంస్థ వైపు నుండి పూర్తయ్యాయన్నారు. ఏటి అగ్రహారం, డొంక రోడ్, టెలికాం నగర్, శారదా కాలనీ రోడ్ల పనులు జరుగుతున్నాయని, రెడ్డిపాలెం రోడ్ విస్తరణ వేగంగా చేపట్టడానికి ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. అనుమతి లేని లే అవుట్లను ఇన్ ప్రిన్సిపల్ లే అవుట్ ద్వారా రెగ్యులరైజ్ చేయాలని, టిపిఎస్‌లు సచివాలయాల వారీగా లే అవుట్లను గుర్తించాలని చెప్పారు. అనధికార లే అవుట్లను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని టిపిఎస్‌లను ఆదేశించారు. బకాయి ఉన్న మీడియా డివైజ్ ఫీజుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని, ప్రతి బోర్డ్‌కు యూనిక్ ఐడి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనధికార నిర్మాణాలను గుర్తిస్తే సంబంధిత ప్లానింగ్ కార్యదర్శితో పాటుగా పట్టణ ప్రణాళిక అధికారిపైనా శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్ల విస్తరణ పనుల్లో నష్ట పరిహారాలు, టిడిఆర్ బాండ్ల పంపిణీ వేగవంతం చేయాలన్నారు. కోర్ట్ కేసులకు పక్కాగా కౌంటర్స్ దాఖలు చేయాలని, నిర్లక్ష్యంగా ఉండే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో సిటి ప్లానర్ మూర్తి, డిప్యూటీ సిటి ప్లానర్ కోటయ్య, ఏసిపిలు కాలేష, బాబురావు, అజయ్ కుమార్, మేనేజర్ శివన్నారాయణ, టిపిఎస్‌లు, సర్వేయర్లు, పాల్గొన్నారు.

స్త్రీల భాగస్వామ్యంతోనే దేశం పురోగతి

అర్‌విఆర్ అండ్ జెసి సదస్సులో వక్తలు

ప్రజాశక్తి - గుంటూరు

పురుషులతో పాటు స్త్రీలకూ సమాన గౌరవాన్నిస్తూ వారు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహిస్తేనే దేశం ఆర్థిక పురోగతిని సాధిస్తుందని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. కాలేజీలోని లేడీ అడ్వైజరీ అండ్ ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ కన్వీనర్ డాక్టర్ జి.సుధావాణి ఆధ్వర్యంలో 'సెక్సువల్ హెరాస్మెంట్ ఆఫ్ ఉమెన్ ఎట్ వర్క్ ప్లేస్ (ప్రివెన్షన్, ప్రొహిబిషన్ అండ్ రిడ్రెస్సల్) యాక్ట్, 2013' అంశంపై సదస్సు శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జెసి కాలేజ్ ఆఫ్ లా ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ సుధాకర్‌బాబు, గుంటూరు లీగల్ ఫ్యామిలీ కౌన్సిలర్ పి.మైథిలి నాయుడు మాట్లాడారు. స్త్రీలపై దాడులను అరికట్టేందుకు, వారికి సమాజంలో తగిన ప్రాధాన్యం కల్పించేందుకు ప్రభుత్వాలు తెచ్చిన చట్టాలను పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా వివరించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో విధులు నిర్వహించే ప్రదేశాల్లో స్త్రీలను, గౌరవించుకుని తమ కుటుంబ సభ్యులనే భావనతో తత్సంబంధాలు కలిగి ఉన్నప్పుడే మంచి ఫలితాలు సాధ్యమవుతాయన్నారు. మారుతున్న చట్టాలపై ఉద్యోగులు తప్పకుండా అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ప్రతిఒక్కరూ తమ వ్యక్తిత్వాన్ని పరిశీలించుకోవాలని, ఎదుటి వారి పట్ల మంచి ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. స్త్రీలు చట్టాలను ఆశ్రయించే అవసరం లేని సమాజ నిర్మాణం జరిగినప్పుడే దేశ కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయని అన్నారు. పురుషులతో సమానంగా స్త్రీలను గౌరవించుకున్నపుడే సమ సమాజ నిర్మాణం జరుగుతుందని కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణ ప్రసాద్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డీన్లు, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ సిహెచ్ సుధాకర్‌బాబు